teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 92 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 9 సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## సెప్టెంబర్ 17న 'స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభం

**ప్రారంభించనున్న ప్రధాని మోదీ**



న్యూ ఢిల్లీ, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): ఈ నెల 17న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను ప్రారంభిస్తారు. దేశవ్యాప్తంగా మహిళలు మరియు పిల్లలకు ఆరోగ్య సంరక్షణ సేవలను బలోపేతం చేయడం, మెరుగైన ప్రాప్యత, నాణ్యమైన సంరక్షణ మరియు అవగాహనను

మిగతా 2 లో



## బతుకమ్మ మొదలు దసరా వరకు హాలీడేస్

**దసరా సెలవులను ప్రకటించిన విద్యాశాఖ**

**పాఠశాలలకు 13 రోజుల పాటు దసరా సెలవులు**

**ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ**

తెలంగాణలోని విద్యార్థులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు విద్యాశాఖ దసరా సెలవులను ప్రకటించింది. ఈ మేరకు సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. బతుకమ్మ మొదలు దసరా పండుగ వరకు హాలీడేస్ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.



## ఉప రాష్ట్రపతి ఎన్నికకు దూరంగా ఉంటాం

**ఎన్నికలో నోటా ఉంటే నోటాకు ఓటేసేవాళ్లం**

**ఎన్నికల్లో పాల్గొనటం లేదని కేటీఆర్ స్పష్టం**

హైదరాబాద్, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): 2025, సెప్టెంబర్ 9వ తేదీ జరగనున్న ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొనటం లేదని ఈ ఎన్నికకు దూరంగా ఉంటున్నట్లు స్పష్టం చేశారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. రెండు పార్టీల అభ్యర్థులు మంచోళ్లే అని అంతకంటే రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం అంటూ చెప్పుకొచ్చారాయన. ఉప రాష్ట్రపతి ఎన్నికలో నోటా ఉంటే నోటాకు ఓటేసేవాళ్లం అని స్పష్టం చేసిన కేటీఆర్ నోటా లేకపోవడంతో ఓటింగ్‌కు దూరంగా

మిగతా 2 లో



## స్థానిక సంస్థల ఎన్నికలు?

**బీసీ రిజర్వేషన్లపై సందిగ్ధత**




- గవర్నర్- ప్రభుత్వ మధ్య ఉత్కంఠ
- గవర్నర్ ఆమోదం కోసం ఎదురుచూపులు
- హైకోర్టును ఆశ్రయించే యోచనలో ప్రభుత్వం
- ఎన్నికలు ఆలస్యం అయ్యే అవకాశం
- గవర్నర్ కోటా ఎమ్మెల్సీల సిఫార్సు

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తున్నది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయంతో పంచాయతీ, పరిషత్ ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఎన్నికలకు సంబంధించిన బిల్లు రాష్ట్రపతి, గవర్నర్ ఆమోదం కోసం పెండింగ్‌లో

మిగతా 2 లో



## పథకాలకు రుణాలు ఇవ్వాలి

**రాష్ట్ర అభివృద్ధిలో బ్యాంకర్ల పాత్ర కీలకం**

**బ్యాంకర్లను డిప్యూటీ సీఎం భట్టి విజ్ఞప్తి**

.. వివరాలు 2లో



## కాంగ్రెస్ పార్టీ బీసీలకు మోసం చేస్తోంది

**కాంగ్రెస్ పార్టీపై కవిత తీవ్ర ఆరోపణలు**

.. వివరాలు 2లో



## కవిత సస్పెన్షన్‌పై స్పందించిన కేటీఆర్

**పార్టీకి నష్టం చేకూర్చిన ప్రతి ఒక్కరికీ ఇదే రూల్**

**పార్టీలో చర్చించి తీసుకున్న నిర్ణయం అంటూ స్పష్టం**

.. వివరాలు 2లో



## యూరియా కోసం రైతులు ఆందోళన చెందద్దు

**రాజకీయ స్వార్థంతో రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయ్**

**యూరియా పంపిణీలో పకడ్బందీ చర్యలు చేపట్టాలి**

**అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశాలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): యూరియా పంపిణీలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని, రాజకీయ

మిగతా 2 లో

## తెలంగాణ రైతాంగం పట్ల కేంద్రం వివక్షత

**కేంద్రం తీరుపై మంత్రి పొన్నం విమర్శలు**



హైదరాబాద్, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం



## మురికినీటిలో విగ్రహాల నిమజ్జనం పాపం

**వినాయక్ సాగర్ శుద్ధికి సహకరించాలి**

**సీఎంకు రాజాసింగ్ విజ్ఞప్తి**

**భాగ్యనగరంలో ప్రశాంతమైన గణేశ్ నిమజ్జనం**

**సీఎం రేవంత్‌రెడ్డికి రాజాసింగ్ ప్రశంసలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): భాగ్యనగరంలో గణేశ్ నిమజ్జనం చాలా ప్రశాంతంగా పూర్తి అయిందని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యానించారు. పోలీస్, మున్సిపల్, నీటి శాఖ, ట్రాఫిక్ శాఖ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిమజ్జన కార్యక్రమానికి బాగా

మిగతా 2 లో

## మూసీ పునరుజ్జీవం పనులకు సీఎం శ్రీకారం



**ప్రాజెక్టు ఫేజ్-2,3 పనులకు శంకుస్థాపన**

**15 కొత్త రిజర్వాయర్లను ప్రారంభించనున్న సీఎం**

హైదరాబాద్, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): మూసీ పునరుజ్జీవం పనులకు సీఎం రేవంత్ రెడ్డి ఎట్టకేలకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు సోమవారం ఆయన గండిపేట్‌లో రూ.7,360 కోట్ల వ్యయంతో చేపట్టబోయే గోదావరి డ్రింకింగ్ వాటర్ స్కీమ్ ప్రాజెక్టు ఫేజ్-2,3 పనులకు శంకుస్థాపన చేశారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ చెరువులను మంచినీటితో నింపాలన్న ఉద్దేశంతో

మిగతా 2 లో

## సుప్రీంకోర్టులో సీఎం రేవంత్‌రెడ్డికి ఊరట



02

**పరువు నష్టం పిటిషన్ నిరాకరణ.. పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీం**



05

## స్టేట్ బీజేపీ కమిటీని ప్రకటిస్తూ జేపీ నడ్డా ఆదేశాలు

**వివరాలను విడుదల చేసిన నడ్డా**



02

## రాష్ట్రంలో ప్రముఖ కంపెనీ ఏర్పాటుకు రంగం సిద్ధం

**ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు డేకిన్ అంగీకారం**

# స్థానిక సంస్థల ఎన్నికలు..?

మొదటి పేజీ తరువాయి

ఉండటంతో ఈ గడువులోపు బిల్లులు ఆమోదం పొందకపోతే హైకోర్టును ఆశ్రయించి ఎన్నికలకు మరింత గడువు కోరే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం.

**బీసీ రిజర్వేషన్లపై కేబినెట్ నిర్ణయం**

ఆగస్టు 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై కీలక నిర్ణయం తీసుకుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రిజర్వేషన్లలో పరిమితి ఎత్తివేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఈ నిర్ణయం అమలు కావాలంటే గవర్నర్ ఆమోదం అవసరం. ఇప్పటికే ఈ మేరకు బిల్లును గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వద్దకు పంపినట్లు తెలుస్తోంది.

**గవర్నర్ ఆమోదం కోసం ఎదురుచూపులు**

రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటే, గవర్నర్ ఆమోదం తప్పనిసరి. ఈ బిల్లు గవర్నర్ వద్ద ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. ఈనెల 30లోపు బిల్లు ఆమోదం పొందితేనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. లేని పక్షంలో, ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించి ఎన్నికలకు మరింత గడువు కోరే యోచనలో ఉన్నట్లు సమాచారం.


**ఎన్నికల కోసం మరింత గడువు కోరే యోచన**

గవర్నర్ ఆమోదం ఆలస్యమైతే, ఎన్నికల నిర్వహణకు తగిన సమయం అవసరమని పేర్కొంటూ హైకోర్టును ప్రభుత్వం ఆశ్రయించవచ్చని తెలుస్తోంది. బీహార్ ఎన్నికలు ముగిసిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. అందుకోసం హైకోర్టును రెండు నుంచి మూడు నెలల గడువు కోరనున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది.

**ప్రజాస్వామ్య ప్రక్రియలో ఆలస్యంపై విమర్శలు**

స్థానిక సంస్థల ఎన్నికల ఆలస్యంపై ఇప్పటికే విపక్షాల నుంచి విమర్శలు ఎదురవుతున్నాయి. ప్రజాస్వామ్య ప్రక్రియలో స్థానిక సంస్థలు అత్యంత కీలకం కాబట్టి, ఎన్నికలను సత్వరమే నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే, రిజర్వేషన్లపై స్పష్టత వచ్చాకే ఎన్నికలు నిర్వహించాలన్న ప్రభుత్వ నిర్ణయం సరైనదేనని అధికార పార్టీ వాదిస్తున్నది.



**గవర్నర్ కోటా ఎమ్మెల్సీల సిఫార్సు**

కేబినెట్ భేటీలో స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు గవర్నర్ కోటా ఎమ్మెల్సీలపైనా చర్చ జరిగింది. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా భారత మాజీ క్రికెట్ కెప్టెన్ అజారుద్దీన్, తెలంగాణ ఉద్యమ నాయకుడు కోదండరాం పేర్లను గవర్నర్‌కు సిఫార్సు చేసింది. ఈ పేర్లను కూడా గవర్నర్ ఆమోదం కోసం పంపింది. ఈ సిఫార్సులపై గవర్నర్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ అంశం కూడా రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సర్కార్ నిర్ణయం, గవర్నర్ ఆమోదం కోసం ఎదురుచూపులు, కోర్టులో గడువు కోరే యోచన వంటి పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇవన్నీ రాష్ట్రంలో స్థానిక పాలన, ప్రజాస్వామ్య వికేంద్రీకరణపై ప్రభావం చూపే అంశాలుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఉప రాష్ట్రపతి ఎన్నికకు దూరంగా ఉంటాం

మొదటి పేజీ తరువాయి

ఉంటామన్నారు. యూరియా కొరత వల్ల తెలంగాణ రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులు ఇబ్బంది పడుతున్నారని వాళ్ల సమస్య పరిష్కరించినోళ్లకే ఓటేస్తామని ముందుగానే చెప్పామంటూ వివరణ ఇచ్చారు కేటీఆర్. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్న కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వానికి సోయి లేదని తెలంగాణ ప్రజల పక్షాన మేము ఉప రాష్ట్రపతి ఎన్నికలకు దూరంగా ఉంటామని స్పష్టం చేశారు కేటీఆర్. తెల్లారితే ఉప రాష్ట్రపతి ఎన్నిక జరగనున్న వేళ కేటీఆర్ క్లారిటీ ఇవ్వడంతో బీఆర్ఎస్ పార్టీ ఏ అభ్యర్థికి మద్దతు ఇస్తుందని కేడర్‌లో నెలకొన్న గందరగోళం వీడింది. జగదీప్ ధన్ ఖడ్ రాజీనామాతో ఉప రాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైన విషయం తెలిసిందే. 2025, సెప్టెంబర్ 9న ఉప రాష్ట్రపతి ఎన్నిక జరగనుండగా అధికార ఎన్డీఏ కూటమి మహారాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను బరిలోకి దింపగా ఇండీ కూటమి తరుపున సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి పోటీలో ఉన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీతో బీఆర్ఎస్‌కు రాజకీయ పోరు ఉండటంతో ఈ రెండింట్లో ఏ వర్గానికి మద్దతు ఇచ్చిన ఇరకాటంలో పడే అవకాశం ఉండటంతో బీఆర్ఎస్ మొత్తానికి ఓటింగ్ కే దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకుంది. బీఆర్ఎస్ పార్టీకి రాజ్యసభలో నలుగురు సభ్యులు ఉన్నారు.

## యూరియా కోసం రైతులు ఆందోళన చెందద్దు

మొదటి పేజీ తరువాయి

స్వార్థంతో కొందరు రెచ్చగొట్టే ప్రయత్నాలపై రైతులు ఆలోచన చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం రైతాంగానికి భరోసాగా నిలుస్తుందని చెప్పారు. సోమవారం మీడియాతో మాట్లాడిన ఆయన యూరియాను కొనుగోలు చేసి ఇళ్లలో నిల్వ పెట్టుకోవద్దని రైతులకు సూచించారు.

**యూరియా పంపిణీకి మరిన్ని కేంద్రాలు:**

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు యూరియా పంపిణీకి మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ వెల్లడించింది. ఈ మేరకు వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపీ ఓ ప్రకటన విడుదల చేశారు. యూరియా పక్కదారి పట్టకుండా రాష్ట్ర వ్యాప్తంగా 500 రైతు వేదికల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతు వేదికల వద్ద రైతులకు టోకెన్లు జారీ చేసి క్యూ లైన్లు లేకుండా యూరియా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ చర్యలతో సజావుగా యూరియా పంపిణీ జరుగుతుండటంపై అన్నదాతల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు యూరియా కేంద్రాలు 12 వేల వరకు ఉన్నట్లు చెప్పిన ఆయన ఎక్కువ మంది రైతులు ప్రభుత్వ కేంద్రాల వద్దనే కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారని అందువల్లే ఆయా కేంద్రాల వద్ద రద్దీ ఏర్పడుతుందని తెలిపారు.

## సెప్టెంబర్ 17న 'స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

నిర్ధారించడం ఈ చొరవ లక్ష్యం అని కేంద్ర ఆరోగ్య మంత్రి జెపి నడ్డా ఒక సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు. దేశవ్యాప్తంగా అభియాన్‌లో భాగంగా, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు మరియు ఇతర ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలలో 75 వేల ఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నట్లు ఆయన అన్నారు. ఈ శిబిరాలు మహిళలు మరియు పిల్లల ఆరోగ్య సంరక్షణ అవసరాలను తీర్చడానికి ప్రత్యేకంగా రూపొం దించబడిన ముఖ్యమైన సేవలను అందిస్తాయి, ప్రభుత్వ సమ్మిళిత ఆరోగ్య సంరక్షణ దార్శనికతకు మద్దతు ఇస్తాయి. అదనంగా, పోషకాహారం, ఆరోగ్య అవగాహన మరియు మొత్తం శ్రేయస్సును ప్రోత్సహించడానికి అన్ని అంగన్‌వాడీలలో పోషణ్ మాహ్‌ను పాటిస్తామని మంత్రి అన్నారు. దేశవ్యాప్తంగా ఆరోగ్యకరమైన కుటుంబాలు మరియు సాధికారత కలిగిన సమాజాలను నిర్మించడమే ఈ చర్యల లక్ష్యం అని శ్రీ నడ్డా అన్నారు. అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు మరియు ఆరోగ్య సంరక్షణ వాటాదారులు ముందుకు వచ్చి ఈ జన భాగీదారీ అభియాన్‌లో అంతర్భాగంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## కవిత సస్పెన్షన్‌పై స్పందించిన కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ పార్టీ నుంచి కల్వకుంట్ల కవిత సస్పెన్షన్ తెలంగాణ పాలిటిక్స్‌లో చర్చనీయాం శంగా మారింది. ఇప్పటికే ఆయా పార్టీలు ఈ విషయంపై రకరకాలుగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. కవిత వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉండి కథ నడిపిస్తున్నాడని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తుంటే మరోవైపు హరీశ్‌రావు, సంతోష్ రావులు సీఎం రేవంత్ రెడ్డితో చేతులు కలిపారంటూ కవిత సంచలన ఆరోపణలు చేస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ఆమె రోజుకో సంచలన విషయాన్ని బయటపెడుతూ బీఆర్ఎస్ పార్టీకి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కీలక పరిణామం చోటుచేసుకుంది. సోమవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత సస్పెన్షన్‌పై ఓ జర్నలిస్ట్ కేటీఆర్‌ను ప్రశ్నించగా ఆయన ఆసక్తికర సమాధానం చెప్పారు. కవిత సస్పెన్షన్ విషయం పార్టీలో చర్చించి తీసుకున్నదని స్పష్టం చేశారు. పార్టీకి నష్టం చేకూర్చిన ప్రతి ఒక్కరికీ ఇదే రూల్ వర్తిస్తుందని తెలిపారు. కవితపై చర్చలు తీసుకున్నాక ఇక మాట్లాడేది ఏం లేదని కేటీఆర్ సూటిగా సమాధానం చెప్పారు.

## తెలంగాణ రైతాంగం పట్ల కేంద్రం వివక్షత

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ రైతాంగం పట్ల వివక్షత చూపిస్తుందన్నారు. ఎరువుల తయారీ, సరఫరా భాద్యత కేంద్రానిదే ఉద్దేశ పూర్వకముగా రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని ఓపెన్ చేయట్లేదు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కూడా పట్టించుకోట్లేదు. మీకు చేతనైతే కేంద్రం మెడలు వంచి ఎరువులు తెండి రైతులు ఉద్యమించే వరకు కేంద్ర ప్రభుత్వం చూస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరును చెడగొట్టాలని బీజేపీ చూస్తుంది అని అనుమానం వస్తుంది. రామచందర్ రావుకు అవగాహన లేదు, సోయి లేదు ఆయనకు రైతుల గురించి తెలియదు ఎరువుల గురించి తెలియదు పార్టీ అధ్యక్షుడిగా తెలంగాణ రైతులకు ఎరువులు ఇవ్వాలని బాధ్యత లేదా? ఏరోజు అయినా కేంద్రానికి లేఖ రాసిండా?రైతుల సహకారంతో త్వరలో బీజేపీ వ్యతిరేక కార్యక్రమాలు చేపడతాం. దిగుబడి తక్కువైతే రాష్ట్ర ఆదాయం తగ్గి పోతుంది. తెలంగాణ ప్రభుత్వం రూ. 22వేల కోట్లు రైతులకు ఋణ మాఫీ చేసినందుకు ఎరువులు ఇవ్వట్లేదా? రైతు భరోసా ఇచ్చినందుకు ఎరువులు ఇవ్వట్లేదా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ చెప్పాలి. కాంగ్రెస్ కు చెడ్డ పేరు తేవాలని పానిక్ కు గురి చేస్తుంది. బీఆర్ఎస్ నాయకులు రైతులను పానిక్ కు గురి చేస్తున్నారు. ఎరువులు ఇచ్చిన పార్టీకి ఓటు వేస్తామని బీఆర్ఎస్ అంటుంది. తెలుగు బిడ్డ సుదర్శన్ రెడ్డి కి ఓటు వేయండి. రైతులు ఎరువుల కోసం ఇబ్బంది పడుతున్న విషయంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులం కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశామని తెలిపారు.

## మూసీ పునరుజ్జీవం పనులకు సీఎం శ్రీకారం



మొదటి పేజీ తరువాయి

రేవంత్ సర్కార్ ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అదేవిధంగా ఓఆర్ఆర్ ఫేజ్-2లోని ప్రాంతాలకు తాగునీటి సరఫరా కోసం చేపట్టిన ప్రాజెక్టులో నిర్మించిన 15 కొత్త రిజర్వాయర్లను కూడా సీఎం ప్రారంభించన్నున్నారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్ (హ్యామ్) విధానంలో చేపట్టనున్నారు. ఇందు కోసం ప్రభుత్వం 40 శాతం పెట్టుబడి పెడుతుండగా కాంట్రాక్టు సంస్థ 60 శాతం నిధులను సమకూర్చుకోనుంది. ఈ మొత్తం పనులు ప్రారంభించిన నుంచి రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రధానంగా మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి 20 టీఎంసీల నీటిని తరలించనున్నారు. దీంతో మూసీ పునరుజ్జీవానికి 2.5 టీఎంసీల నీటిని కేటాయించి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాలను నింపనున్నారు. మిగతా 17.5 టీఎంసీలను హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాలకు వినియెగించనున్నారు. నీటి తరలింపులో భాగంగా నగరంలో ఉన్న 7 చెరువులను కూడా అదే నీటితో నింపనున్నారు. 2027 డిసెంబరు నాటికి హైదరాబాద్ తాగునీటి అవసరాలు తీర్చేందుకు, ప్రతిరోజూ నల్లా నీటిని సరఫరా చేయడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును సర్కార్ చేపడుతుండటం విశేషం. కాగా, సీఎం రేవంత్ రెడ్డి అంతకు ముందు కోకాపేటలోని నియోపోలిస్ ట్రంపెట్ జంక్షన్‌ను ప్రారంభించారు.

## బతుకమ్మ మొదలు దసరా వరకు హాలీడేస్

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణలోని విద్యార్థులకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు విద్యాశాఖ దసరా సెలవులను ప్రకటించింది. ఈ మేరకు సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. బతుకమ్మ మొదలు దసరా పండుగ వరకు హాలీడేస్ ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని అన్ని పాఠశాలలకు 13 రోజుల పాటు దసరా సెలవులు ఇచ్చింది. విద్యాశాఖ క్యాలెండర్ ప్రకారం ఈ నెల 21 నుంచి అక్టోబర్ 3 వరకు హాలీడేస్ ఉండనున్నాయి. దీంతో పాటు అక్టోబర్ 4న తిరిగి స్కూళ్లను తెరవనున్నారు. అయితే 5వ తేదీ ఆదివారం కావడంతో ఆరో తేదీన స్కూళ్లను తెరిచే అవకాశం కనిపిస్తోంది. అయితే ఈసారి ఈ సెలవుల్లో అక్టోబర్ 2న గాంధీ జయంతి కాగా అదే రోజు దసరా వచ్చింది. అంతేకాదు ఈ నెల 28 నుంచి అక్టోబర్ 5 వరకు జూనియర్ కాలేజీలకు సెలవులు ఇచ్చారు.

## పథకాలకు రుణాలు ఇవ్వాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): వ్యవసాయ అనుబంధ రంగాలతో పాటు ఇందిరమ్మ ఇండ్లు, స్వయం ఉపాధి పథకాలకు విరివిగా రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. రాష్ట్ర అభివృద్ధిలో బ్యాంకర్ల పాత్ర కీలకమైనదని చెప్పారు. సోమవారం ప్రజాభవన్ లో స్టేట్ లెవల్ బ్యాంకర్లతో సమావేశమైన భట్టి విక్రమార్క ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ రైజింగ్ -2047 లో బ్యాంకర్ల పాత్ర కీలకమైనదన్నారు. 3.87 లక్షలతో తలసరి ఆదాయంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్ర భాగాన నిలిచిందని, వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాల్లో దేశంలోనే రాష్ట్రం నంబర్ వన్ గా ఉందని చెప్పారు. వ్యవసాయ రంగంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రైతులకోసం రుణమాఫీ, రైతుభరోసా, ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. వార్షిక రుణ ప్రణాళికలో మొదటి క్వార్టర్ లోనే 33.64 శాతం సాధించడం అభినందనీయం అన్నారు. ఆస్తుల తాకట్టు, ఫిక్స్ డ్ డిపాజిట్లు చేయాలని రైతులకు ఒత్తిడి చేయవద్దన్నారు. వ్యవసాయ రంగం ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని రైతుల పక్షాన రైతుమాఫీ, రైతు భరోసా పేరిట బ్యాంకులకు రుణాలు జమ చేశామన్నారు. రూ.30 వేల కోట్లు రైతుల పక్షాన రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులకు జమ చేసిందన్నారు. బ్యాంకింగ్ రికవరీ చరిత్రలో ఇదో రికార్డు అని చెప్పారు.

## కాంగ్రెస్ పార్టీ బీసీలకు మోసం చేస్తోంది

హైదరాబాద్, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకుండా మోసం చేస్తోందని మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. సోమవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో 70కి పైగా బీసీ కులాల నాయకులతో ఆమె భేటీ అయ్యారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ ఇంత వరకు తెలంగాణ బీసీల రిజర్వేషన్ల అంశాన్ని ఎందుకు పార్లమెంట్‌లో ప్రస్తావించలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కామెంట్ చేశారు. బీసీ సంఘాలను కలుపుకుని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా ఉద్యమ కార్యాచణ రూపొందిస్తామని అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.

## మురికినీటిలో విగ్రహాల నిమజ్జనం పాపం

మొదటి పేజీ తరువాయి

సహకరించారని తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు రాజాసింగ్. ట్యాంకుబండ్‌పై జరిగిన వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గరుండి నిరంతరం పర్యవేక్షించారని.. ఈ క్రెడిట్ ఆయనకే దక్కుతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కొన్ని సూచనలు చేశారు రాజాసింగ్. వినాయక్ సాగర్ నీరు మురికిగా ఉందని.. దురదృష్టవశాత్తూ దేవుళ్ల నిమజ్జనాలను కూడా ఆ నీటిలోనే చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు రాజాసింగ్. ఇలా చేస్తే పాపం చేస్తున్నట్లు అవుతోందని చెప్పుకొచ్చారు. వినాయక్ సాగర్ నీటిని పరిశుభ్రం చేస్తానని మాజీ సీఎం కేసీఆర్ కూడా గతంలో చెప్పారని గుర్తుచేశారు. వినాయక్ సాగర్‌లోకి మురికి కాలువ నీరు వస్తోందని ఆ నీటిని మళ్లించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. వినాయక్ సాగర్‌ను వర్షపు నీటితో నింపాలని సూచించారు. రాబోయే ఏడాది వినాయక్ సాగర్‌లో చేసే గణనాథుల నిమజ్జనాలను మంచి వర్షపు నీటిలో చేయాలని సూచించారు. ఇందుకోసం సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా కృషి చేయాలని కోరారు. ఇలా చేస్తే రేవంత్‌రెడ్డికి, గణేష్ భక్తులందరికీ తప్పకుండా స్వామివారి ఆశీర్వాదం లభిస్తుందని ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు.

## సుప్రీంకోర్టులో సీఎం రేవంత్ రెడ్డికి ఊరట

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి భారీ ఊరట లభించింది. సీఎం రేవంత్‌కు వ్యతిరేకంగా తెలంగాణ బీజేపీ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పరువు నష్టం పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. ఈ కేసును విచారణను స్వీకరించేందుకు న్యాయస్థానం నిరాకరించింది. పిటిషన్‌ను కొట్టివేసింది. వివరాల్లోకి వెళితే 2024 లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా కొత్తగూడెం రేవంత్ రెడ్డి సభ నిర్వహించారు. ఈ సభలో రేవంత్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని ఆయన చేసిన వ్యాఖ్యలు బీజేపీ ప్రతిష్టను దెబ్బతీశాయని ఆరోపిస్తూ ఆ పార్టీ నేత కాసం వెంకటేశ్వర్లు గతేడాది హైదరాబాద్ ప్రజాప్రతినిధుల కోర్టులో ఫిర్యాదు చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దవుతాయని రేవంత్‌రెడ్డి తప్పుడు వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను సోమవారం చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ధర్మాసనం కొట్టివేసింది.

## రాష్ట్రంలో ప్రముఖ కంపెనీ ఏర్పాటుకు రంగం సిద్ధం

**ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు డేకిన్ అంగీకారం**

హైదరాబాద్, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో మరో ప్రముఖ కంపెనీ ఏర్పాటు కాబోతున్నది. ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ యూనివర్సిటీ డేకిన్ అంగీకారం తెలిపింది. ఈ మేరకు సోమవారం సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో లెటర్ ఆఫ్ ఇంటెంట్ (ఎల్‌వోఐ)పై ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా, డేకిన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఇయాన్ మార్టిన్ సంతకాలు చేశారు.

# చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు షెడ్యూల్ తయారు చేయాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): మహిళలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు చేపట్టిన స్వస్థ నారి %-% సశక్త పరివార్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహణకు షెడ్యూల్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో స్వస్థ నారి %-% సశక్త పరివార్ అభియాన్ పథకంపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అభియాన్ ద్వారా దేశవ్యాప్తంగా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి, మహిళలకు ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలను అందించనున్నారని తెలిపారు. మహిళలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, బలోపేతం చేయడం కుటుంబాల ప్రగతికి అత్యంత ముఖ్యమని అన్నారు. ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన స్వస్థ నారి - సశక్త పరివార్ అభియాన్ పేరుతో ఆరోగ్య కార్యక్రమాలను సెప్టెంబర్ 17వ తేదీ నుండి అక్టోబర్ 2వ తేదీ వరకు దేశవ్యాప్తంగా నిర్వహించనున్నారని,. గాంధీ జయంతిని ఈ కార్యక్రమం ముగియనుందని వివరించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పోషణ మాసంతో సమన్వయం చేస్తూ ఈ అభియాన్‌ను దేశవ్యాప్తంగా ప్రారంభించనున్నారని తెలిపారు. జాతీయ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని మధ్యప్రదేశ్ లోని ఇండోర్ నగరంలో ప్రధానమంత్రి ప్రారంభిస్తారన్నారు. మహిళలకు రక్తపోటు, మధుమేహం నోటి, రొమ్ము, గర్భాశయ ముఖం క్యాన్సర్ స్క్రీనింగ్ ఉంటుందని అలాగే రక్తహీనత పరీక్షలు, యువతులకు, మహిళలకు సలహాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ట్యూబర్కులోసిస్,సికిల్ సెల్ వ్యాధి పరీక్షలతో పాటు నిపుణులైన వైద్యుల సేవలు.మొదలైనవి అందంచడం జరుగుతుందని తెలిపారు. తల్లి బిడ్డ సంరక్షణ, గర్భిణీ స్త్రీలకు పరీక్షలు, కౌన్సిలింగ్, ఎంసిపి కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే పిల్లలకు అవసరమైన టీకాలు అందజేయడం కూడా జరుగుతుందని తెలిపారు. మాసిక ధర్మ పరిశుభ్రత, పోషకాహారంపై ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్వయం సహాయ సంఘాలు, స్థానిక సంస్థల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, డిఆర్డీఓ బాల కృష్ణ ఆర్డిఓ రవి, సంక్షేమ అధికారి మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు నుండి సమస్యల దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దరఖాస్తుదారుల సమస్యలు నేరుగా అడిగి తెలుసుకుని 68 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తుదారుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత, కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. పరిష్కారంలో జాప్యం జరగొద్దని హెచ్చరించారు. సంబంధిత శాఖాధికారులు సమస్య పరిష్కారానికి కృషి చేయాలని దరఖాస్తులను ఆయా శాఖల అధికారులనకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. ప్రతి దరఖాస్తుకు స్పష్టమైన సమాధానం, తగిన సమాచారం ప్రజలకు అందించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా జిల్లా యంత్రాంగానికి తెలియజేయగల వేదికని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఆర్డఓ రవి అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



ములుగు జిల్లా, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులు సమన్వయంతో త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ రోజు ప్రజావాణి కార్యక్రమంలో 49 దరఖాస్తులు రాగా అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 13, భూ సమస్యలు 10, పెన్షన్ 09, ఉపాధి కల్పనకు 02, ఇతర ఇతర శాఖలకు సంబంధించినవి 15 దరఖాస్తుల స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 10న స్థానిక సంస్థల తుది ఓటరు జాబితా

## జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



ములుగు జిల్లా, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల తుది ఓటరు జాబితాను ఈ నెల 10న వెలువరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే ఓటరు జాబితా ప్రదర్శన చేయడం జరిగిందని అన్నారు. ముసాయిదా పోలింగ్ కేంద్రాల జాబితాకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు చేర్పులు జరిపిన మీదట సెప్టెంబర్ 10వ తుది జాబితా వెలువరిస్తామని సూచించారు. మండల స్థాయిలో నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కూడా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరడం జరిగిందన్నారు. తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డిప్యూటీ సి ఈ ఓ రాజు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అదనంగా 16 ఎరువుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): రైతులకు ఎరువుల విక్రయాల్లో రద్దీ తగ్గించి సౌకర్యవంతమైన విధంగా పంపిణీ చేయడానికి అదనంగా 16 ఎరువుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో వ్యవసాయ శాఖ, సహకార శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనంగా ఏర్పాటు చేయనున్న 16 ఎరువుల విక్రయ కేంద్రాలకు ఈ-పాస్ యంత్రాలను పంపిణీ చేశారు. రైతులు సమయానికి ఎరువులు పొందేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామ పేర్కొన్నారు. రైతులు రద్దీ తగ్గించేందుకు అదనపు ఎరువుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అదనపు ఎరువుల విక్రయ కేంద్రాలు సహకార సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించబడ తాయని ఆయన తెలిపారు. రైతు అవసరాలు తీర్చడం మన అందరి బాధ్యతని, ఎరువుల సరఫరా సమయానికి జరిగేలా వ్యవసాయ, సహకార శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి వాల్యా నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లీగల్ అవగాహన సదస్సు




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): మహిళా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో, సంఘమిత్ర డిగ్రీ కళాశాల భూపాలపల్లి లో "లీగల్ అవగాహన సదస్సు" ఘనంగా నిర్వహించబడింది. సమాజంలో న్యాయ అవగాహన పెంపొందించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జి అఖిల ముఖ్య అతిథిగా హాజరై, చట్టాలపై విద్యార్థులకు విలువైన అవగాహన కల్పించారు. జడ్జి మాట్లాడుతూ ప్రతి పౌరుడికి, ముఖ్యంగా యువతకు, న్యాయసంబంధిత అంశాలపై స్పష్టమైన అవగాహన అవసరం. గృహహింస (డొమెస్టిక్ వైలెన్స్), బాలలపై లైంగిక వేధింపులపై పోక్సో చట్టం,పోష్ ఆక్ట్,181, చైల్డ్ లైన్ వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం రావాలి. చట్టాన్ని తెలిసినవారే తమ హక్కుల్ని కాపాడుకోగలరు. అందుకే ఈ తరహా కార్యక్రమాలు ఎంతో అవసరం అని వివరించారు. అనంతరం జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిణి శ్రీమతి మల్లీశ్వరి మాట్లాడుతూ నేటి విద్యార్థులు రేపటి దేశ భవిష్యత్తు. వారు చట్టాలపై అవగాహనతో ఎదగాలి. మహిళలకు మాత్రమే కాకుండా పురుషులకు కూడా చట్ట పరిరక్షణ ఉంది. అందువల్ల ప్రతి ఒక్కరూ న్యాయ సూత్రాలు, హక్కులు, బాధ్యతలు తెలుసుకోవడం కీలకం, అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత విభాగ సిబ్బంది అనూష, మమత, కృష్ణ,సురేష్,చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ తిరుపతి, సఖి కేంద్రం అడ్మినిస్ట్రేటర్ గాయత్రి, కళాశాల అధ్యాపకులు ప్రవీణ్, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ అవార్డు అందుకున్న తౌటి నరేష్

రేగొండ సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల విద్యాశాఖ ఆఫీసులో ఎంఐఎస్ కోఆర్డినేటర్గా గత 13 సంవత్సరాల నుండి సుధీర్ఘంగా విద్యాశాఖలో పనిచేస్తున్న తౌటి నరేష్ కు మండల విద్యాశాఖ అధికారి మరియు ఎంపీడీవో చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. అనేక పాఠశాలల ఉపాధ్యాయుల నుండి ప్రభుత్వం నుండి అవార్డు తీసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇలాగే భవిష్యత్తులో నా వృత్తికి మంచి పేరు వచ్చే విధంగా అందరితో మమేకమై నడుచుకుంటానని "తీన్మార్ న్యూస్" దినపత్రికకు తెలియజేశారు.



# గ్రామాల్లో పర్యవేక్షించని మండల అధికారి





## వార్త కథనాలకు సైతం స్పందన కరువు

## అధికారుల తీరుపై మండిపడుతున్న స్థానికులు

కొత్తపల్లి గోరి, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండలంలోని గ్రామాల పరిస్థితి అద్వానంగా మారింది. నూతనంగా ఏర్పడిన మండలం పేరుకే మండల అధికారిగా ఉన్నారంటే ఉన్నారు అనే విధంగా మండలంలో చర్చనీఅంశంగా మారింది. మండల అధికారి పర్యవేక్షణ కరువైందని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని పల్లె ప్రకృతి వనాలు పారిశుద్ధ్య పనులపై నీలి నీడలా మండల అధికారి వ్యవహరిస్తున్నారని చర్చనీయంగా మారింది. పల్లె ప్రకృతి వానాలపై "తీన్మార్ న్యూస్ దినపత్రిక"లో ఇప్పటికే ప్రచురించడం జరిగింది. ఐనప్పటికీ చర్యలు తీసుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు మండల అధికారి వ్యవహరిస్తున్నాడని ప్రజలు వాపోతున్నారు. కావున జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి గ్రామాల అభివృద్ధికి తోడ్పడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుచున్నారు.


తీన్మార్ 4

అధ్వానంగా మారిన పల్లె ప్రకృతి వనాలు

తీన్మార్ www.teenmaarepaper.com 30 Aug 2025 - Page 4

# సఫాయి కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం

**ఆత్మహత్య చేసుకున్న కార్మికుడు మైదం మహేష్**

**బాధిత కుటుంబానికి అండగా ఉంటాం**

**మైదం మహేష్ కుటుంబానికి న్యాయం అందేదాకా పోరాటం చేస్తాం**

**బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భిక్షాటన కార్యక్రమం**

**బడే నాగజ్యోతి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి**






ములుగు, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): పారిశుద్ధ కార్మికుని ఆత్మహత్య ముమ్మాటికీ ప్రభుత్వ హత్యనేనని దీనికి బాధ్యత మంత్రి సీతక్క వహించాలని బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి ఆరోపించారు. ఈ మేరకు సోమవారం రోజున ములుగు జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బడే నాగజ్యోతి కార్యకర్తలతో కలిసి ఏరియా హాస్పిటల్ నుండి బస్టాండ్ వరకు బిక్షాటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బడే నాగజ్యోతి మాట్లాడుతూ ఐదు నెలల నుండి వేతనం అందించడం లేదని ములుగు మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు మైదం మహేష్ అధికారులను కోరిన కూడా జీతం ఇవ్వలేదని మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. మైదం మహేష్ ఆత్మహత్య కు కారణం కాంగ్రెస్ సర్కార్ రే కారణమని విమర్శించారు. ఇందుకు సీఎం రేవంత్ రెడ్డి మంత్రి సీతక్క బాధ్యత వహించి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాల్సిన సర్కార్ మహేష్ మరణం పై ద్రుష్ప్రచారం చేయడం దుర్మార్గమని అన్నారు. మంచినీళ్లు అనుకొని పురుగుల మందు తాగినట్టు చెప్పి ఒక ఫేక్ వీడియోను సృష్టించి సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఆదుకోవాల్సిన సర్కారీ ఇలాంటి దుర్మార్గానికి ఒడిగట్టిందని మండిపడ్డారు. తప్పుడు చర్యలతో ప్రభుత్వ ఘోర వైఫల్యం కప్పు పుచ్చుకోలేరని బడే నాగజ్యోతి హెచ్చరించారు. మైదం మహేష్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవడం లేదని బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భిక్షాటన కార్యక్రమాన్ని చేపట్టమని, కార్యక్రమం ద్వారా వచ్చిన మొత్తాన్ని వారి కుటుంబానికి అందిస్తామని బడే నాగజ్యోతి తెలియజేశారు. మైదా మహేష్ కుటుంబానికి న్యాయం జరిగే దాకా ప్రభుత్వంపై పోరాట చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేష్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ చెన్న విజయ్, వేములపల్లి బిక్షపతి, పోరిక విజయ్ రామ్ నాయక్, గొర్రె సమ్మయ్య, కోగిల మహేష్, వేల్పుల సత్యం, ఆకుతోట చంద్రమౌళి, గరిగె రఘు, బైకాని సాగర్, గండి కుమార్, కవ్వంపల్లి బాబు, గడ్డమీది భాస్కర్, యూనిస్, మాదం సాగర్, వాంకుడోత్ రాందాస్, దూడబోయిన శ్రీనివాస్, గజ్జి నగేష్, సోహెల్, కోడపాక మహేందర్, జట్టి పున్నం, దేవర రాజు, ఇరుప విజయ, మర్రి అంకుష్, ఎండి ఖాసీం, ఆరెపల్లి కిషన్, తదితరులు పాల్గొన్నారు.

# బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీన్ బకాయిలను విడుదల చేయాలి

**పిడిఎస్యు ఆధ్వర్యంలో డిమాండ్**

**వరంగల్ జిల్లా కలెక్టర్ కి వినతి**




వరంగల్, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): సోమవారం పిడిఎస్యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో పి బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం బకాయిలను విడుదల చేయాలని,అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, గురుకులాలలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనల పై న్యాయవిచారణ జరపాలని,అలాగే విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, మెస్ కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని, సంక్షేమ హాస్టల్స్ పెండింగ్ లో ఉన్న డేట్ బిల్లులను విడుదల చేసి,బి పి ఈ డి కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వరంగల్ జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పి డి ఎస్ యు ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుర్రం అజయ్, మర్రి మహేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తానని చెప్పి మాట తప్పిందని, బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం బకాయిలను విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, గురుకులాలలో జరుగుతున్న ఫుడ్ పాయిజన్ జరిగి మరణిస్తున్న విద్యార్థులకు న్యాయ విచారణ చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. నాణ్యమైన ఆహారాన్ని అందించకుండా ప్రభుత్వం పక్కదారి పట్టిస్తుందని ఆరోపించారు. కాస్మోటిక్ చార్జీలు, సంక్షేమ హాస్టల్స్ పెండింగ్ లో ఉన్న డేట్ బిల్లులు విడుదల చేయడం లేదని ధ్వజమెత్తారు. బీపీఈడీ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులు ఫైనల్ ఇయర్ అయిపోయిన తర్వాత సర్టిఫికెట్లు ఇవ్వమంటే పెండింగ్లో ఉన్న ఫీజు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామని ఆయా కళాశాల యాజమాన్యాలు ప్రిన్సిపల్స్ విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్ స్కాలర్షిప్లు విడుదల చేయాలని, విద్యార్థులకు ఉచితంగా బస్ పాస్ లు ఇవ్వాలని, కార్పోరేట్ విద్యాసంస్థల పై చర్యలు తీసుకుని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, లెక్చరర్స్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వం స్పందించని యెడల పి డి ఎస్ యు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు రాజేష్, రాంబాబు, శ్యామ్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 17 నుండి స్వాస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలు

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**




హనుమకొండ జిల్లా, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా ఈనెల 17 నుండి అక్టోబర్ 2వ తేదీ వరకూ స్వాస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో స్వాస్థ్ నారీ, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం విజయవంతంగా అమలు చేయడంపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాలతో మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసేందుకు ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు శిబిరాలు నిర్వహించేందుకు 'స్వాస్థ్ నారీ', సశాక్థ్ పరివార్ అభియాన్' కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్రంలోని మహిళలకు పక్షం రోజుల పాటు నిర్దేశించిన ఆసుపత్రులలో స్పెషలిస్ట్ వైద్యులచే అన్ని రకాల వైద్య పరీక్షలు చేసేందుకు ఏర్పాటు చేయించడం జరుగుతుందన్నారు. అధిక రక్తపోటు, మధుమేహం, ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలు , బ్లడ్ డొనేషన్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందన్నారు. రక్తహీనతకు గురి కాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యుక్త వయస్సు అమ్మాయిలకు, మహిళలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అన్ని పాఠశాలలు, గురుకులాలు, కళాశాలలో విద్యార్థినులకు అనీమియా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. 15 రోజులపాటు నిర్వహించే కార్యక్రమాలపై మహిళలకు తెలియజేయాలని, ఇందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. జిల్లాలో షెడ్యూల్ ప్రకారం వైద్య శిబిరాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా , స్పెషలిస్ట్ వైద్యులను సమీకరించుకొని ప్రైవేటు డాక్టర్ల అసోసియేషన్ ల సహకారంతో ఈ వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా నిర్వహించే ఈ కార్యక్రమాలకు వివిధ ప్రభుత్వ విభాగాలు తమ యొక్క సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ఇన్చార్జి సీఈవో రవి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారి నిర్మల, గిరిజన, బీసీ సంక్షేమ శాఖ అధికారులు ప్రేమకళ, లక్ష్మణ్, ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ గౌతమ్ చౌహాన్, జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, గైనకాలజిస్టుల సంఘం అధ్యక్షులు డాక్టర్ శ్రీ లక్ష్మి, అడిషనల్ డీఎంహెచ్వో డాక్టర్ మదన్ మోహన్ రావు, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ విజయకుమార్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ మహేందర్, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



డోర్నకల్, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): సోమవారం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, మైనారిటి రెసిడెన్షియల్ పాటశాలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని పేషెంట్ ల యొక్క వివరాలను, సిబ్బంది వివరాలను, ల్యాబ్ ను, చుట్టూ పరిసరాలను తనిఖీ చేశారు. ఆసుపత్రి చుట్టుప్రక్కల పరిశుభ్రమమైన వాతావరణంతో వచ్చే రోగులకు వైద్యాన్ని అందరికి ఖచ్చితంగా అందేలా చూడాలన్నారు. సరిపడా మందులు ఆసుపత్రిలో ఎప్పటికి అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. లేకపోతే తెప్పించుకోవాలన్నారు. అనంతరం మైనారిటీ రెసిడెన్షియల్ పాటశాలను తనిఖీ చేసి. అక్కడి వంటశాల, స్టోర్ రూం, హాస్టల్ గదులు, తరగతి గదులను, స్టాఫ్ రూం లను పరిశీలించారు. విద్యార్థుల యొక్క తరగతి గదిలో విద్యార్థుల యొక్క అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి షెడ్యూల్ ప్రకారం సిలబస్ పూర్తి చేసి విద్యార్థులలోని సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలన్నారు. పాటశాల ఆవరణలో పరిశుభ్రమైన వాతావరణం ఉండాలన్నారు. ఇట్టి తనిఖీ లో డోర్నకల్ మునిసిపల్ కమిషనర్ నిరంజన్, వైద్యాధికారులు ఉన్నారు.

# అందరికీ అందుబాటులో యూరియా

**మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి**



మహబూబాబాద్, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశాల ప్రకారం అందరికి యూరియా అందించే విధంగా రైతు భరోసా డేటా ప్రకారం ముందస్తు సమాచారం ఇచ్చి రైతులకు అందించడం జరుగుతున్నదని మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి, జినుగు మరియన్న అన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం, నెల్లికుదురు పరిధి లోని నెల్లికుదురు, బ్రాహ్మణకొత్తపల్లి, నైనాలా గ్రామాల రైతుల కు రైతు భరోసా డేటా ప్రకారం ముందస్తు సమాచారం ను సొసైటీల ద్వారా, వ్యవసాయ శాఖ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, స్థానిక సిబ్బంది ద్వారా సమాచారం అందించి, 20 (ఇరవై టన్నుల) యూరియాను సక్రమంగా పంపిణీ చేయడం జరిగిందని ఇదే పద్ధతి ప్రకారం ప్రతి రైతుకు యూరియా అందుబాటులో ఉంటుందని రైతులందరికి తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేష్ తహసీల్దార్, కుమార్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఎస్ఐ రాజేశ్, వ్యవసాయ విస్తరణ అధికార్లు ప్రవీణ్, చందన, ప్రతిభ, మణికంఠ, పంచాయతీ కార్యదర్శులు రాజేష్, శరత్, అశోక్ శ్రీను, సుభాష్, పూర్ణ, సురేష్,నగేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో కలెక్టర్ సుడిగాలి పర్యటన






మహబూబాబాద్ జిల్లా, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): సోమవారం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ కేసముద్రం, ఇనుగుర్తి మండలాలలో సుడిగాలి పర్యటన చేశారు. మండలాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ ద్వారా యూరియా పంపిణీని స్వయంగా పరిస్థితిని పరిశీలిస్తూ రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. స్టాక్ రిజిస్టర్ లను తనిఖీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా యూరియా పంపిణీ జరగాలని అన్నారు. క్యూ లైన్ లలో తోపులాట జరగకుండా పోలీసు సిబ్బంది గట్టి బందోబస్త్ ఏర్పాటు చేయాలని అన్నారు. అనంతరం కె.జి.బి.విని తనిఖీ చేసి స్టోర్ గదిని పరిశీలించి నాణ్యమైన వంట పదార్థాలతో విద్యార్థులకు వంట వండి పెట్టాలని అన్నారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడి వారి యొక్క అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. కేసముద్రం, ఇనుగుర్తి లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించి ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్ రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్ పరిశీలించి సీజనల్ వ్యాదులపై అప్రమత్తంగా ఉంటూ ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు సరైన వైద్యం అందించాలన్నారు. సరిపడా మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రులోని పరిసరాలను పరిశుభ్రంగా ఉండాలని అన్నారు. కేసముద్రం అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించి అంగన్ వాడీ కేంద్రంలోని పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని అన్నారు. పిల్లల ఆరోగ్యంపై టీచర్లు ఎప్పటికప్పుడు ప్రత్యేకమైన శ్రద్ధ వహించలన్నారు. ఇట్టి తనిఖీలో మండలాల ప్రత్యేక అధికారులు, వైద్యాదికారులు, తదితరులు ఉన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులపై చర్యలు చేపట్టాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులు 150**



హనుమకొండ జిల్లా, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాలను అందజేశారు. ప్రజలు వినతి పత్రం అందజేస్తూ తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. వచ్చిన ప్రతి దరఖాస్తును స్వీకరిస్తూ ప్రజలు తమ సమస్యలను చెప్పగా కలెక్టర్ ఓపిగ్గా వింటూ సమాధానం ఇచ్చారు. వినతి పత్రం స్వీకరించిన వెంటనే సంబంధిత శాఖల అధికారులను సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అక్కడికక్కడే ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో తమ తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 150 వినతులను ప్రజలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి. గణేష్, డిఆర్డీవో మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ నారాయణ, సిపిఓ సత్యనారాయణరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉన్నతంగా రాణించవచ్చు



జనగామ జిల్లా, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్బంగా జిల్లా విద్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ధర్మ కంచ లోని జిల్లా పరిషత్ హై స్కూల్లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ చదువు రాని వారికి అందరికి చదువు వచ్చేలా చెయ్యాలని, అందులో పాఠశాల విద్యార్థుల భాగస్వామ్యం ఉండాలన్నారు. చదువు మధ్యలో మానివేసిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా 10వ తరగతి లో చేరాలని, పదవ తరగతి తరవాత చదువు మానేసిన వారు Intermediateలో చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనగామ మండల విద్యాశాఖాధికారి శంకర్ రెడ్డి , ధర్మకంచ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనకయ్య , వయోజన విద్య లైజన్ అధికారి విజయ్ కుమార్ , ఉల్లాస్ / టాస్ ఇంచార్జ్ శంకర్ రావు , సీఎంఓ వేముల నాగరాజు , మెప్మా RPలు, సీఎంఓ, టీఎంసీ లు పాఠశాల బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

## పేషంట్లు ఫిజియోథెరపీని వినియోగించుకోవాలి



జనగామ జిల్లా, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు కావలసిన వైద్య సౌకర్యాలను దరి చేర్చాలని గొప్ప ఉద్దేశంతో వైద్య సౌకర్యాలను మెరుగుపరుస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి డా. కె. మల్లికార్జున్ రావుతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అనేక రకాల వ్యాధుల నుండి త్వరగా కోలుకోవడంలో ఫిజియోథెరపీ ఎంతో పనిచేస్తుందన్నారు. ప్రజలు తప్పనిసరిగా ఫిజియోథెరపిస్టుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలు చురుకుగా, ఆరోగ్యంగా, స్వతంత్రంగా జీవించేందుకు ఫిజియోథెరపిస్టులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా. ఎ. మధుకర్ యాదవ్,(RMO) జనగాం GGH, ఫిజియోథెరపీ వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## క్లస్టర్ వారీగా 129మంది జీపీవోలు విధుల్లోకి హాజరు

### పూర్తి పార దర్శకంగా కౌన్సిలింగ్ ద్వారా కేటాయింపు


### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): గ్రామ పరిపాలన అధికారుల కేటాయింపు పూర్తి పారదర్శకంగా.. కౌన్సిలింగ్ ద్వారా జరిగిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామ పరిపాలన అధికారుల నియామకానికి శ్రీకారం చుట్టి రాత పరీక్ష నిర్వహించి అర్హులైన వారికీ ఈ నెల 5 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందచేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జిల్లాకి సంబందించిన 129 మందికి క్లస్టర్ వారీగా మండలాలకి కేటాయించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. వీరందరు ఈరోజు నుండి విధుల్లోకి చేరారు.

## వినతులను సత్వరమే పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద... 136 ఫిర్యాదుల స్వీకరణ



వరంగల్ జిల్లా, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల ఫిర్యాదులను కలెక్టర్ స్వయంగా స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా శాఖల అధికారులకు అందజేశారు. నేటి ప్రజావాణి కార్యక్రమానికి 136 ఫిర్యాదులు రాగా, అధికంగా రెవెన్యూ సమస్యలు 60, జిడబ్ల్యూ ఎంసీ 21, విద్యాశాఖ 11, సహకార శాఖ 9, గృహ నిర్మాణ శాఖ 7, వైద్య ఆరోగ్య శాఖ, ఉపాధి కల్పన శాఖలకు 3 చొప్పున, ఇతర శాఖలకు సంబంధించిన 22 ఫిర్యాదులు వచ్చాయి. అర్జీదారుల దరఖాస్తులలో పేర్కొన్న సమస్యల పై క్షుణ్ణంగా పరిశీలించి, మానవతా దృక్పథంతో పరిష్కరించుటకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఫిర్యాదుదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, డిఆర్ ఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డిఎఓ అనురాధ, డిఎం హెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, హౌసింగ్ పీడీ గణపతి, డిసిఓ రాజమణి, ఆర్డీవోలు సత్యపాల్ రెడ్డి, ఉమారాణి, ఆర్సివో అపర్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసిల్దార్లు, విభాగాల పర్యవేక్షకులు,తదితరులు పాల్గొన్నారు.

# ఏటీసీ ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

### జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్.





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత అందిపుచ్చుకొని తమ భవిష్యత్తును బలోపేతం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం కలెక్టర్ మణుగూరు ప్రభుత్వ ఐటిఐ కళాశాల మరియు ఏటీసీ సెంటర్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఏటీసీ భవన సముదాయాన్ని పరిశీలించారు. ఐటిఐ లను ఆధునీకరించే క్రమంలో ఏటీసీలను ఏర్పాటు చేశామని, వీటిలో శిక్షణ పొందిన విద్యార్థులకు పారిశ్రామిక రంగంలో ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఏటీసీ శిక్షణ పూర్తి చేసిన ప్రతి విద్యార్థికి వివిధ పరిశ్రమంలో ఉద్యోగ అవకాశాలను కల్పించేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. విద్యార్థులు శిక్షణ కాలంలో కష్టపడి చదివి సంపూర్ణ నైపుణ్యాన్ని పొందాలని, వారికి కావలసిన పుస్తకాలను ఉచితంగా అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ఐటిఐ లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్. విద్యార్థులకు కావలసిన అన్ని సౌకర్యాలు పరికరాలు కల్పించాలని దానికి అవసరమైన ప్రణాళికలు రూపొందించి నివేదికలు అందజేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మణుగూరు తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో తెలంగాణ 11వ ఎన్ సి సి ఖమ్మం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎన్సిసి క్యాంపును సందర్శించారు. ఈరోజు ప్రారంభమైన ఈ ఎన్ సి సి క్యాంపు 17వ తారీఖు వరకు పది రోజులు పాటు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 700 మందితో ఈ క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్యాంప్ కమాండెంట్ కల్నల్ సంజయ్ కుమార్ భద్ర, మరియు క్యాంప్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కల్నల్ నవీన్ యాదవులను కలిసి క్యాంపు వివరాలు, శిక్షణ, శిక్షణానంతరం ఉద్యోగ అవకాశాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్యాంపు సజావుగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. క్యాంపు ప్రదేశంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని కలెక్టర్ సందర్శించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్సిసి శిక్షణ ద్వారా క్రమశిక్షణ, నాయకత్వం మరియు దేశ సేవ వంటి విలువలు పెరుగుతాయన్నారు. జిల్లాలో రథం గుట్ట వంటి సహజ సౌందర్య ప్రదేశాలను ఎన్సిసి అడ్వెంచర్ క్యాంపులకు వినియోగించుకోవచ్చని, దీని ద్వారా జిల్లా పర్యాటక రంగంలో మరింత ప్రాధాన్యతను పొందుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీఓ వెంకటేశ్వరరావు ఐటిఐ సూపర్డెంట్ జ్యోతిరాణి, ఏటీవోలు జీ.వీ కృష్ణారావు, వేణుగోపాల్ మరియు ఏటీసీ సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దేశ అభివృద్ధికి శాస్త్రవేత్తలు అవసరం

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): దేశ అభివృద్ధికి, ప్రజల భవిష్యత్ పురోగతికి శాస్త్రవేత్తలు అవసరం అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం కలెక్టర్ కరకగూడెం జవహర్ నవోదయ విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల సమగ్ర పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, కిచెన్ షెడ్, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్ ,మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలను ఆయన పరిశీలిస్తూ సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. కలెక్టర్ తరగతి గదిలో విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటిస్తూ వారి జీవిత లక్ష్యాలను తెలుసుకున్నారు. విద్యార్థులు డాక్టర్లు, ఇంజనీర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అవ్వాలని తమ అభిలాషను తెలియజేయగా, కలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగత లక్ష్యసాధనతో పాటు దేశాభివృద్ధికి తోడ్పడే దిశగా చదువుకోవడం, పరిశోధనలు చేయడం అత్యంత ముఖ్యమని సూచించారు. సమాజంలో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపే ఆవిష్కరణలు, పరిశోధనలు చేయగలిగే శాస్త్రవేత్తలు దేశానికి ఎంతో అవసరమని, విద్యార్థులు ఆ దిశగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. తరువాత కలెక్టర్ డైనింగ్ హాల్ పరిశీలించి అక్కడ దోమలు, ఈగలు లోపలికి ప్రవేశించకుండా మెష్ ఏర్పాటు చేయాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. అలాగే కూరగాయలు, పెరుగు తదితర పదార్థాలు నిల్వ చేసుకోవడానికి ఫ్రిజ్ ఏర్పాటు చేయాలన్న సిబ్బంది అభ్యర్థనపై వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. విద్యార్థులు పరిశుభ్రమైన వాతావరణంలో ఆరోగ్యకరమైన, పౌష్టికాహారం తీసుకుంటూ చదువు కొనసాగించేలా అన్ని ఏర్పాట్లు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ నవోదయ విద్యాలయాలు దేశవ్యాప్తంగా ఒక ప్రత్యేకమైన బ్రాండ్‌గా గుర్తింపు పొందాయని, ఆ ప్రతిష్టను నిలబెట్టే విధంగా అధికారులు ప్రతి విషయంలో అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచి, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు అందించాల్సిందిగా ఆయన సూచించారు. అదేవిధంగా విద్యార్థుల మానసిక, శారీరక అభివృద్ధికి అవసరమైన క్రీడా సామాగ్రి, లైబ్రరీ పుస్తకాలు త్వరలోనే ఏర్పాటు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్ పాఠశాల సిబ్బందితో సమావేశమై విద్యార్థులకు అందజేస్తున్న సదుపాయాలు, ఉన్న సమస్యలను వివరంగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభ్యున్నతికి, పాఠశాల అభివృద్ధి కోసం చేపట్టవలసిన పనులను తమ దృష్టికి తీసుకువస్తే వాటిని ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట పాఠశాల ప్రిన్సిపల్ భాస్కరాచారి, ఉపాధ్యాయులు నయనాదేవి, చంచల్, అనిత, స్టాఫ్ నర్స్ రాధిక మరియు సిబ్బంది సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్టేట్ బీజేపీ కమిటీని ప్రకటిస్తూ జేపీ నడ్డా ఆదేశాలు

తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 08 (తీన్మార్ న్యూస్): తెలంగాణ బీజేపీ స్టేట్ కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ప్రకటించారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాలు, ఆమోదం మేరకు సోమవారం స్టేట్ బీజేపీ కమిటీని ప్రకటిస్తూ రామచందర్ రావు ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యక్షులుగా 8 మంది, ప్రధాన కార్యదర్శులు 3, కార్యదర్శులు 8, ట్రెజరర్ 1, జాయింట్ ట్రెజరర్ 1, చీఫ్ స్పోక్ పర్సన్ గా 1, ఏడు మోర్చాలకు అధ్యక్షులను నియమించారు.

**స్టేట్ కమిటీ:**

ఉపాధ్యక్షుడు – డా. బూర నర్సయ్య గౌడ్
ఉపాధ్యక్షుడు – డా. కసం వెంకటేశ్వర్లు యాదవ్
ఉపాధ్యక్షుడు – భండారి శాంతి కుమార్
ఉపాధ్యక్షురాలు – ఎం. జయశ్రీ
ఉపాధ్యక్షురాలు – కొల్లీ మాధవి
ఉపాధ్యక్షుడు – డా. జారుపలవత్ గోపి (కల్యాణ్ నాయిక్)
ఉపాధ్యక్షుడు – రఘునాథ్ రావు
ఉపాధ్యక్షురాలు – బండా కార్తీక రెడ్డి
ప్రధాన కార్యదర్శి – డా. ఎన్. గౌతమ్ రావు
ప్రధాన కార్యదర్శి – టీ. వీరేందర్ గౌడ్
ప్రధాన కార్యదర్శి – వేముల అశోక్
కార్యదర్శి – డా. ఓ. శ్రీనివాస్ రెడ్డి
కార్యదర్శి – కొప్పు భాషా
కార్యదర్శి – భరత్ ప్రసాద్
కార్యదర్శి – బండారు విజయలక్ష్మి
కార్యదర్శి – శ్రవంతి రెడ్డి
కార్యదర్శి – కరణం పరిణిత
కార్యదర్శి – బద్దం మహిపాల్ రెడ్డి
కార్యదర్శి – డా. తుటుపల్లి రవి కుమార్
ట్రెజరర్ – దేవకి వాసుదేవ్
జాయింట్ ట్రెజరర్ – విజయ్ సురానా జైన్
చీఫ్ స్పోక్ పర్సన్– ఎన్.వి. సుభాష్

**మోర్చాల అధ్యక్షులు:**

మహిళా మోర్చా – డా. మేకల శిల్పా రెడ్డి
యువ మోర్చా – గణేష్ కుందే
కిసాన్ మోర్చా – బస్వాపురం లక్ష్మీనరసయ్య
ఎస్సీ మోర్చా – కంతి కిరణ్
ఎస్టీ మోర్చా – నేనావత్ రవి నాయక్
ఓబీసీ మోర్చా – గండమల్ల ఆనంద్ గౌడ్
మైనార్టీ మోర్చా – సర్దార్ జగ్మోహన్ సింగ్



# తరచూ బ్రేక్ ఫాస్ట్‌లో భాగంగా ఇడ్లీలను తింటున్నారా..?

## అయితే ఈ విషయాలను తెలుసుకోండి..!

రోజూ అందరూ అనేక రకాల బ్రేక్‌ఫాస్ట్‌లను చేస్తుంటారు. కొందరు ఇడ్లీలను తింటే కొందరు దోశ లేదా పూరీలను, ఇంకొందరు ఉప్మా వంటివి తింటారు. అయితే సాధారణంగా చాలా మంది తినే అల్పాహారాల్లో ఇడ్లీలు ముందు వరుసలో ఉంటాయని చెప్పవచ్చు. వీటిని నూనె లేకుండా తయారు చేస్తారు. కనుక తేలిగ్గా జీర్ణమవుతాయి. చిన్నారులు, వృద్ధులకు కూడా ఇడ్లీలు సులభంగా జీర్ణమవుతాయి. కనుక ప్రయాణాల్లో ఉన్నప్పుడు కూడా చాలా మంది ఇడ్లీలను తినేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. ఇడ్లీ దక్షిణ భారత దేశ ప్రజలకు ప్రధానమైన అల్పాహారంగా ఉంది. బియ్యం, మినప్పప్పును ఉపయోగించి సాధారణంగా ఎవరైనా ఇడ్లీలను తయారు చేస్తారు. అయితే పలు ఇతర పదార్థాలను కూడా వీటి తయారీకి ఉపయోగిస్తారు.



**చాలా ఆరోగ్యవంతమైన ఆహారం..**

ఇడ్లీని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వైద్యులు సైతం పోషకాహారంగా చెబుతుంటారు. అందుకనే జ్వరం వచ్చిన వారికి కూడా ఇడ్లీ తినమని సూచిస్తుంటారు. ఇడ్లీలకు ఉపయోగించే పిండి రాత్రంతా బాగా పులుస్తుంది. అందుకనే ఇందులో ఔషధ విలువలు పెరుగుతాయి. ఈ పిండిలో ఉండే సాధారణ పిండి పదార్థాలు సంక్లిష్టమైన పిండి పదార్థాలుగా మారుతాయి. ఇవి మనకు ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ఇడ్లీలలో వాడే మినప్పప్పు వల్ల ఇందులో ఉండే ప్రోటీన్లు శరీరానికి లభిస్తాయి. ఇవి శరీరానికి శక్తిని అందించి ఉత్తేజంగా ఉండేలా చేస్తాయి. దీంతో చురుగ్గా ఉంటారు. యాక్టివ్‌గా పనిచేస్తారు. శరీరంలో శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. నీరసం, అలసట తగ్గిపోతాయి. ఇడ్లీలను పూర్తిగా ఆవిరి మీద ఉడికిస్తారు. వీటి తయారీలో ఎలాంటి నూనెలను వాడరు. కనుక ఇడ్లీ చాలా ఆరోగ్యవంతమైన అల్పాహారమని చెప్పవచ్చు.

**చిరు ధాన్యాలతో అయితే మంచిది..**

ఇడ్లీలో గ్లూటెన్ ఉండదు. కొందరికి గ్లూటెన్ సెన్సిటివిటీ ఉంటుంది. అలాంటి ఆహారాలను తింటే పొట్టలో అసౌకర్యం ఏర్పడుతుంది. కానీ ఇడ్లీల్లో గ్లూటెన్ ఉండని కారణంగా అలాంటి వారు కూడా వీటిని ఎలాంటి భయం లేకుండా తినవచ్చు. జీర్ణ సమస్యలు ఉన్నవారికి ఇడ్లీలు చక్కని ఆహారంగా పరిగణించబడతాయి. ఇవి తేలిగ్గా జీర్ణం అవడమే కాదు, జీర్ణ సమస్యలు లేకుండా చేస్తాయి. ఇతర అల్పాహారాలతో పోలిస్తే ఇడ్లీల్లో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. అయితే బియ్యం పిండితోకాకుండా చిరుధాన్యాలతో ఇడ్లీలను తయారు చేసి తింటే ఇంకా ఎక్కువ పోషకాలను పొందవచ్చు. అనేక బి విటమిన్లు లభిస్తాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రోగాలు రాకుండా రక్షిస్తాయి. ఇడ్లీలలో మన జీర్ణ వ్యవస్థకు మంచి చేసే బ్యాక్టీరియా ఉంటుంది. కనుక ఇడ్లీలను ప్రో బయోటిక్ ఆహారంగా చెబుతారు. అందువల్ల ఇడ్లీలను తింటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. ఇది జీర్ణ సమస్యలు లేకుండా చూస్తుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.

**డయాబెటిస్ ఉంటే..?**

ఒక ఇడ్లీని తింటే సుమారుగా 40 నుంచి 50 క్యాలరీలు లభిస్తాయి. కొవ్వు అసలే ఉండదు. కనుకు బరువు తగ్గాలని చూస్తున్నవారికి, బరువు నియంత్రణలో ఉండాలని అనుకునేవారికి ఇడ్లీలు చక్కని ఆహారంగా పనిచేస్తాయి. ఇడ్లీల గ్లైసిమిక్ ఇండెక్స్ కూడా తక్కువగా ఉంటుంది. అయితే బియ్యం పిండి కాకుండా మిల్లెట్స్‌తో ఇడ్లీలను తయారు చేసి తింటే డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ అదుపులో ఉంటాయి. అయితే ఇడ్లీలు ఆరోగ్యకరమే అయినప్పటికీ ప్రస్తుతం రెడీమేడ్ పిండి మార్కెట్‌లో లభిస్తుంది. దాని తయారీలో ఏయే పదార్థాలను ఉపయోగిస్తారో తెలియదు. కనుక అలాంటి పిండిని వాడకూడదు. ఇంట్లో సహజసిద్ధంగా తయారు చేసుకున్న పిండి అయితేనే మంచిది. ఇడ్లీలకు వాడే పిండి పులిసి ఉంటుంది. కనుక కొందరికి ఇడ్లీలను తింటే కడుపు ఉబ్బరం, గ్యాస్ వచ్చే అవకాశాలు ఉంటాయి. అలాంటి వారు ఇడ్లీలను తినకూడదు.

# యాపిల్ సైడర్ వెనిగర్ గురించి మీకు తెలుసా..?

## రోజూ దీన్ని ఇలా తాగితే అనేక లాభాలు..!



సాధారణంగా చాలా మందికి వెనిగర్ గురించి తెలిసే ఉంటుంది. దీన్ని వంటల్లో ఎక్కువగా వేస్తుంటారు. బేకరీ పదార్థాల తయారీలో వెనిగర్‌ను అధికంగా వాడుతారు. సాధారణ వెనిగర్ అయితే మనకు ఆరోగ్య ప్రయోజనాలు కలగవు. కానీ యాపిల్ సైడర్ వెనిగర్ అయితే ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. యాపిల్ పండ్లను పులియబెట్టి యాపిల్ సైడర్ వెనిగర్‌ను తయారు చేస్తారు. ఇది అనేక పోషకాలను, ఔషధ విలువలను కలిగి ఉంటుంది. మనకు అనేక లాభాలను అందిస్తుంది. యాపిల్ సైడర్ వెనిగర్‌లో అసిటిక్ యాసిడ్ ప్రధాన సమ్మేళనంగా ఉంటుంది. ఇది మనకు ఆరోగ్య ప్రయోజనాలను కలగజేస్తుంది. యాపిల్ సైడర్ వెనిగర్‌ను రోజూ తీసుకోడం వల్ల అనేక లాభాలు కలుగుతాయని వైద్యులు చెబుతున్నారు.

**డయాబెటిస్ ఉన్నవారికి..**

షుగర్ ఉన్నవారికి యాపిల్ సైడర్ వెనిగర్ ఎంతో మేలు చేస్తుంది. దీన్ని తీసుకుంటే శరీరం ఇన్సులిన్‌ను మరింత మెరుగ్గా ఉపయోగించుకుంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. అధికంగా బరువు ఉన్నవారు కూడా దీన్ని తీసుకుంటే మేలు జరుగుతుంది. యాపిల్ సైడర్ వెనిగర్‌ను తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. ఆకలి నియంత్రణలో ఉంటుంది. దీని వల్ల ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. శరీరంలోని కొవ్వు కరిగేలా చేస్తుంది. కనుక బరువు తగ్గాలని చూస్తున్నవారు రోజూ దీన్ని తాగుతుంటే ఉపయోగం ఉంటుంది.

**కొలెస్ట్రాల్ లెవల్స్‌కు..**

యాపిల్ సైడర్ వెనిగర్‌ను రోజూ తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. బీపీ నియంత్రణలో ఉంటుంది. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు. యాపిల్ సైడర్ వెనిగర్‌లో యాంటీ మైక్రోబియల్, యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి మన శరీరంలో ఉండే బ్యాక్టీరియా, వైరస్‌లను నాశనం చేస్తాయి. రోగకారక క్రిములను నిర్మూలిస్తాయి. దీంతో ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. రోగాలు రాకుండా ఉంటాయి. యాపిల్ సైడర్ వెనిగర్ అంటే పులిసిన ఆహారం. కనుక ఇది జీర్ణ వ్యవస్థకు మేలు చేస్తుంది. ఇది ప్రో బయోటిక్ ఆహారంగా పనిచేస్తుంది. జీర్ణ వ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది. దీని వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణ సమస్యలు రాకుండా ఉంటాయి.

**ఎలా తాగాలి..?**

యాపిల్ సైడర్ వెనిగర్ లో ఆమ్లత్వం అధికంగా ఉంటుంది. కనుక దీన్ని నేరుగా తాగకూడదు. నీటితో కలిపి తాగాల్సి ఉంటుంది. దంతాలకు ఇది తగలకుండా తాగాల్సి ఉంటుంది. లేదంటే దంతాలపై ఉండే ఎనామిల్ పొర దెబ్బ తినే అవకాశాలు ఉంటాయి. యాపిల్ సైడర్ వెనిగర్‌ను నేరుగా తాగితే ఆహార నాళంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. దీంతో జీర్ణ సమస్యలు వస్తాయి. కనుక కచ్చితంగా నీటితో కలిపి తీసుకోవాల్సి ఉంటుంది. యాపిల్ సైడర్ వెనిగర్‌ను రోజుకు 15 నుంచి 30 ఎంఎల్ మోతాదులో తీసుకోవచ్చు. దీన్ని ఒక గ్లాస్ నీటిలో కలిపి తాగాల్సి ఉంటుంది. యాపిల్ సైడర్ వెనిగర్‌ను ఉదయం అల్పాహారానికి 30 నిమిషాల ముందు తాగాల్సి ఉంటుంది. దీని వల్ల షుగర్ లెవల్స్ రోజంతా నియంత్రణలో ఉంటాయి. దంతాలకు తగలకుండా తాగాలంటే స్ట్రాను ఉపయోగించవచ్చు. యాపిల్ సైడర్ వెనిగర్‌ను నెమ్మదిగా తాగాలి. ఒకేసారి తాగేయకూడదు. ఇలా యాపిల్ సైడర్ వెనిగర్‌ను తీసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు.

# తర్బూజా పండ్లను కేవలం వేసవిలోనే కాదు

## ఈ సీజన్‌లోనూ తినాల్సిందే.. ఎందుకంటే..?

వేసవి కాలంలో సహజంగానే అందరూ శరీరాన్ని చల్లబరుచుకునే ఆహారాలను తింటారు. పానీయాలను సేవిస్తుంటారు. శరీరాన్ని చల్ల బరిచే పండ్లలో తర్బూజాలు కూడా ఒకటి. వీటిని ముక్కలుగా కట్ చేసి వాటిపై కాస్త చక్కెర లేదా తేనె వేసి తినవచ్చు. లేదా తర్బూజాలతో జ్యూస్ తయారు చేసి తాగవచ్చు. అయితే అందరూ తర్బూజాలను కేవలం వేసవిలో మాత్రమే తింటారు. కానీ వాస్తవానికి వీటిని ఏ సీజన్‌లో అయినా సరే తినవచ్చు. ముఖ్యంగా ఉష్ణోగ్రత లేదా తేమ అధికంగా ఉన్నప్పుడు, ఉక్కపోత ఉన్న సమయంలో ఈ పండ్లను తింటే ఎంతో ఉపయోగం ఉంటుంది. తర్బూజాలపై చక్కెర కాకుండా తేనె వేసి తింటే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. డయాబెటిస్ ఉన్నవారు తేనె, చక్కెర వేయకుండా నేరుగా ఈ పండ్లను తినాలి. ఇలా తర్బూజాలను ఏ సీజన్‌లో తిన్నా సరే లాభాలను పొందవచ్చు.



**జ్వరం తగ్గుతుంది..**

తర్బూజా పండ్లలో 90 శాతం నీరే ఉంటుంది. కనుక ఈ పండ్లను తింటే శరీరంలో ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. వేడి వాతావరణం ఉన్నప్పుడు ఈ పండ్లను తింటే ఎంతో మేలు జరుగుతుంది. శరీరంలోని ద్రవాలు బయటకు వెళ్లకుండా ఉంటాయి. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. జీవక్రియలు సక్రమంగా నిర్వర్తించబడతాయి. శరీర మెటబాలిజం పెరుగుతుంది. ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. ముఖ్యంగా జ్వరం వచ్చిన వారు ఈ పండ్లను తింటే త్వరగా కోలుకుంటారు. శరీరం చల్లగా మారుతుంది. తర్బూజా పండ్లలో బీటా కెరోటిన్ అధికంగా ఉంటుంది. ఇది మన శరీరంలో విటమిన్ ఎ గా మారుతుంది. విటమిన్ ఎ వల్ల కళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. కంటి చూపు మెరుగు పడుతుంది. వయస్సు మీద పడడం వల్ల కళ్లలో వచ్చే శుక్లాలను తగ్గించుకోవచ్చు. వృద్ధాప్యంలో ఉన్నవారు రోజూ ఈ పండ్లను తింటుంటే మేలు జరుగుతుంది.

**రోగ నిరోధక శక్తికి..**


తర్బూజా పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. విటమిన్ సి వల్ల తెల్ల రక్త కణాలు ఉత్పత్తి అవుతాయి. దీని వల్ల శరీరం ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. తర్బూజా పండ్లను ఈ సీజన్‌లో తినడం వల్ల సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యలను తగ్గించుకోవచ్చు. జ్వరం నుంచి కూడా కోలుకుంటారు. ఈ పండ్లలో ఉండే విటమిన్ సి, ఇతర యాంటీ ఆక్సిడెంట్లు కొల్లాజెన్‌ను ఉత్పత్తి చేసేందుకు సహాయం చేస్తాయి. కొల్లాజెన్ అనేది ఒక ప్రోటీన్. ఇది చర్మ సంరక్షణకు సహాయం చేస్తుంది. చర్మం తన సాగే గుణాన్ని పొందేలా చేస్తుంది. దీని వల్ల చర్మం మృదువుగా మారి తేమగా ఉంటుంది. కాంతివంతంగా కనిపిస్తుంది. యవ్వనంగా మారుతారు. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి.

**మలబద్ధకం తగ్గేందుకు..**

తర్బూజా పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మలబద్ధకం తగ్గేలా చేస్తుంది. ముఖ్యంగా ఈ సీజన్‌లో చాలా మంది కలుషిత ఆహారం లేదా నీరు తీసుకోవడం వల్ల ఫుడ్ పాయిజన్ బారిన పడుతుంటారు. కానీ తర్బూజా పండ్లను తింటే ఈ సమస్య తగ్గుతుంది. తర్బూజాలలో పొటాషియం అధికంగా ఉండడం వల్ల ఇది బీపీని తగ్గించడంలో సహాయం చేస్తుంది. పొటాషియం వల్ల శరీరంలో సోడియం స్థాయిలు నియంత్రణలో ఉంటాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. అలాగే కిడ్నీలపై పడే భారం తగ్గుతుంది. కిడ్నీ సమస్యలు రాకుండా ఉంటాయి. బరువు తగ్గాలనుకునే వారు రోజూ ఈ పండ్లను తింటుంటే మేలు జరుగుతుంది. వీటిని తింటే ఫైబర్ అధికంగా లభిస్తుంది కనుక కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. ఇలా తర్బూజా పండ్లను ఏ సీజన్‌లో తిన్నా సరే అనేక లాభాలను పొందవచ్చు.

# వెల్లుల్లిని తేనెలో కలిపి తింటే ఏమవుతుందో తెలుసా?

ఇటీవలి కాలంలో ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఖరీదైన మాత్రలు వేసుకునే వారి సంఖ్య పెరుగుతోంది. కానీ, వ్యాధుల నుండి ఉపశమనం పొందడానికి మీరు ఆయుర్వేద సలహాలను సరిగ్గా పాటిస్తే అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. అయితే.. వెల్లుల్లి, తేనె మిశ్రమం ఎలాంటి ఆరోగ్య సమస్యలకు ప్రయోజనకరంగా ఉంటుంది? ఈ మిశ్రమం ఎందుకు మంచిది? అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం..



**రోగనిరోధక శక్తిని పెంచుతుంది:**

వెల్లుల్లి, తేనె రెండింటిలోనూ యాంటీ బాక్టీరియల్, యాంటీవైరల్ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. ప్రతిరోజూ ఉదయం వీటిని తీసుకోవడం వల్ల శరీర రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఫలితంగా జలుబు, గొంతు నొప్పి, తరచుగా వచ్చే జ్వరాలు వంటి సమస్యలు దూరమవుతాయి.

**జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది:**

వెల్లుల్లి జీర్ణక్రియను వేగవంతం చేస్తుంది. ఇది ఆహారాన్ని త్వరగా జీర్ణం చేయడంలో కూడా సహాయపడుతుంది. అంతే కాకుండా గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలను కూడా తగ్గిస్తుంది. తేనెలో ఉండే మంచి బ్యాక్టీరియా కడుపు సంబంధిత సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. అలాగే, సైనస్ సమస్యలను కూడా తగ్గిస్తుంది. దీనితో పాటు, తేనె గొంతు నొప్పి నుండి ఉపశమనం పొందడంలో కూడా సహాయపడుతుంది.

**గుండె ఆరోగ్యానికి మంచిది:**

వెల్లుల్లి గుండెకు చాలా మేలు చేస్తుంది. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. ఇది రక్తాన్ని పలుచబరిచి రక్తపోటును నిర్వహించడానికి సహాయపడుతుంది.

శక్తిని అందిస్తుంది:

తేనె తక్షణ శక్తిని ఇస్తుంది. వెల్లుల్లి రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. శరీరానికి ఆక్సిజన్ సరఫరా చేయడంలో సహాయపడుతుంది. ఈ రెండింటిలోనూ ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని మెరిసేలా చేస్తాయి. అవి వృద్ధాప్య ప్రక్రియను కూడా నెమ్మదిస్తాయి. గోరువెచ్చని నీటితో కలిపి తీసుకుంటే, ఇది జీవక్రియను పెంచుతుంది. బరువు తగ్గడంలో సహాయపడుతుంది.

**ఎలా తినాలి?**

తాజా వెల్లుల్లి రెబ్బలను తొక్క తీసి శుభ్రం చేసి, శుభ్రమైన గాజు కూజాలో ఉంచండి. వెల్లుల్లి రెబ్బలు పూర్తిగా మునిగిపోయేలా వాటిపై తగినంత తేనె పోయాలి. కూజాను మూసివేసి 7 నుండి 10 రోజులు అలాగే ఉంచండి. ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో ఒకటి లేదా రెండు వెల్లుల్లి రెబ్బలను నమలండి. అయితే, దీనిని పిల్లలు లేదా మధుమేహం ఉన్నవారు తీసుకోకూడదు.

# ఆసియా కప్ 2025 టోర్నీకి అంతా సిద్ధం

## యూఏఈ వేదికగా టీ20 ఫార్మాట్



గత రెండు నెలలుగా ధనాధన్ బ్యాటింగ్ కోసం వేచి చూస్తున్న అభిమానుల నిరీక్షణకు తెరపడే సమయం ఆసన్నమైంది. ఐపీఎల్ 2025 సీజన్ ముగింపుతో మూగబోయిన బ్యాట్లు.. ఇక సిక్సర్లు, బౌండరీల మోతతో దద్దరిల్లనున్నాయి. అభిమానులు ఆతృతగా ఎదురు చూస్తున్న ఆసియా కప్ 2025 టోర్నీకి మంగళవారం తెరలేవనుంది.యూఏఈ వేదికగా టీ20 ఫార్మాట్‌లో జరిగే ఈ టోర్నీ కోసం ఆసియా క్రికెట్ దేశాలు సిద్ధమయ్యాయి. ఆతిథ్య యూఏఈతో పాటు భారత్, పాకిస్థాన్, ఒమన్, శ్రీలంక, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, హాంగ్ కాంగ్‌లు బరిలోకి దిగుతున్నాయి. భారత కాలమానం ప్రకారం మ్యాచ్‌లన్నీ రాత్రి 8 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఈ నెల ఆసాంతం జరగనున్న ఈ టోర్నీ అభిమానులకు కావాల్సిన అసలు సిసలు మజా అందివ్వనుంది. అఫ్గానిస్థాన్, హాంగ్ కాంగ్ మధ్య అబుదాబి వేదికగా తొలి మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే ఇరు జట్లు యూఏఈకి చేరుకున్నాయి. అఫ్గానిస్థాన్ ఇక్కడ ట్రై సిరీస్ కూడా ఆడింది. ఫైనల్లో పాకిస్థాన్ చేతిలో ఓడినా.. లీగ్ దశలో ఆ జట్టును ఓడించింది. భారత్ తర్వాత పటిష్టంగా కనిపిస్తోంది. ఆసియాలో భారత్ తర్వాత తామే అత్యంత పటిష్టమైన జట్టుగా నిరూపించుకునేందుకు ఈ టోర్నీని ఉపయోగించుకోవాలని అఫ్గాన్ భావిస్తోంది. హాంగ్ కాంగ్‌తో పోరులో అఫ్గాన్ హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగనుంది. అద్భుతం జరిగితే తప్పా ఈ మ్యాచ్‌లో అఫ్గాన్ సునాయస విజయాన్నందుకుంటుంది. మరోవైపు హాంగ్ కాంగ్ మూడో సారి ఆసియా కప్ బరిలోకి దిగుతోంది. కానీ అఫ్గాన్‌కు పోటీనిచ్చే సామర్థ్యం అయితే హాంగ్ కాంగ్‌కు లేదు.




**అఫ్గానిస్థాన్ జట్టు:**

రషీద్ ఖాన్ (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్, దర్వీష్ రసూలి, సెదిఖుల్లా అటల్, అజ్మతుల్లా ఒమర్‌జాయ్, కరీం జనత్, మహ్మద్ నబీ, గుల్బదిన్ నైబ్, షరాఫుద్దీన్ అష్రఫ్, మహ్మద్ ఇషాక్, ముజీబ్ ఉర్ రెహమాన్, అల్లా ఘజన్‌ఫర్, నూర్ అహ్మద్, ఫరీద్ మాలిక్, నవీన్-ఉల్-హక్, ఫజల్హక్ ఫరూఖీ.

**హాంగ్ కాంగ్ జట్టు:**

యాసిమ్ ముర్తాజా (కెప్టెన్), బాబర్ హయాత్, జీషాన్ అలీ, నియాజకత్ ఖాన్ మహ్మద్, నస్రుల్లా రాణా, మార్టిన్ కోయెట్జీ, అన్షుమాన్ రథ్, కల్హాన్ మార్క్ చల్లు, ఆయుష్ ఆశిష్ శుక్లా, మహ్మద్ ఐజాజ్ ఖాన్, అతీక్ ఉల్ రెహ్మాన్ ఇక్బాల్, కించిత్ షా, ఆదిల్ మెహమూద్, హరూన్ మహ్మద్ అర్షద్, అలీ హసన్, షాహిద్ వాసిఫ్, ఘజాన్‌ఫర్ మహ్మద్, మహ్మద్ వహీద్, అనాస్ ఖాన్.

## టీమిండియాకు షాకింగ్ ఓటమి ఇచ్చేందుకు తొడకొట్టిన పసికూన..?

ఆసియా కప్ 2025లో మరోట్రోఫీ గెలిచేందుకు భారత జట్టు సిద్ధంగా ఉంది. టోర్నమెంట్ మంగళవారం (సెప్టెంబర్ 9) ప్రారంభమవుతుంది. ఆ తర్వాత ఒక రోజు అంటే బుధవారం నాడు భారత జట్టు తన మొదటి మ్యాచ్‌ను యూఏఈ తో ఆడనుంది. 14వ తేదీన, పాకిస్తాన్ తో, 19వ తేదీన ఒమన్ తో తలపడనుంది. టోర్నమెంట్‌లో ట్రోఫీని గెలుచుకునేందుకు భారత జట్టు ఓ బలమైన పోటీదారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. కాగితంపై మిగతా జట్లు జట్లు బలహీనంగా కనిపిస్తున్నాయి. కానీ క్రికెట్‌లో ఎప్పుడైనా అపజయాలు జరగవచ్చు. ముఖ్యంగా దిగ్గజ జట్లకు కూడా ఊహించని షాక్ తగలవచ్చు. ఇప్పటికే ఇలాంటి ఓటముల బారిన పడిన జట్లు కూడా ఉన్నాయి. ఓమన్ ఆల్ రౌండర్ సుఫియాన్ మహమూద్ తన జట్టు ఆసియా కప్‌లో కొన్ని ఆటుపోట్లను సృష్టించగలదని నమ్ముతున్నాడు. ఆసియా కప్‌లో తొలిసారి పాల్గొంటున్న ఓమన్ జట్టు సెప్టెంబర్ 12న దుబాయ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో పాకిస్థాన్‌తో తన తొలి మ్యాచ్ ఆడనుంది. ఓమన్ సెప్టెంబర్ 15న యూఏఈతో, సెప్టెంబర్ 20న భారత్‌తో తలపడనుంది. మహమూద్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తన జట్టు ప్రత్యర్థులకు సమస్యలు సృష్టించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. "ఇలాంటి టోర్నమెంట్‌లో ఆడుతున్నప్పుడు, నిర్భయంగా ఉండాలి. ఎందుకంటే కోల్పోవడానికి ఏమీ లేదు. మీ ప్రతిభను ప్రదర్శించడానికి, మీరు భయాన్ని అధిగమించాలి. మనం ప్రస్తుతం ఆడుతున్నట్లుగా, మంచి క్రికెట్ ఆడటం కొనసాగిస్తే, మనం నిరాశను కూడా ఎదుర్కోగలమని నేను నమ్ముతున్నాను. ఇది ఒక పెద్ద ప్రకటనలా అనిపించవచ్చు, కానీ ఈ టోర్నమెంట్‌లో మేం బలమైన ప్రభావాన్ని చూపగలమని నాకు పూర్తిగా నమ్మకం ఉంది" అని ఆయన అన్నారు. గత సంవత్సరం టీ20 ప్రపంచ కప్ తర్వాత ఓమన్ క్రికెట్ బోర్డుతో కాంట్రాక్ట్ వివాదాల కారణంగా వారి మొదటి ఎంపిక ఆటగాళ్లలో ఎక్కువ మంది అందుబాటులో లేరు. కాబట్టి, ఆసియా కప్‌లో ఓమన్ రెండవ శ్రేణి జట్టును కలిగి ఉంటుంది. ఈ టోర్నమెంట్ వారికి చాలా ముఖ్యమైనదని, ముఖ్యంగా భారత్, పాకిస్తాన్ వంటి భారీ జట్లతో మ్యాచ్‌లు ఆడాలని మహమూద్ నొక్కి చెప్పుకొచ్చాడు. ఆసియా కప్ గురించి ఓమన్ కెప్టెన్ జితేంద్ర సింగ్ తన ఉత్సాహాన్ని వ్యక్తం చేశాడు. ఇది తనకు భారతదేశంలోని కొంతమంది అత్యుత్తమ స్టార్లతో సంభాషించే అవకాశాన్ని ఇస్తుంది. గత సంవత్సరం పురుషుల ఎమర్జింగ్ ఆసియా కప్‌లో అభిషేక్ శర్మతో ఆడాడు. శుభ్‌మాన్ గిల్, సూర్యకుమార్ యాదవ్, అభిషేక్‌లను మళ్ళీ కలవడానికి అతను చాలా ఉత్సాహంగా ఉన్నాడు. ఈ ఆటగాళ్లతో సంభాషించాలని, వారి మనస్తత్వాన్ని అర్థం చేసుకోవాలని, వారు తమ ప్రణాళికలను ఎలా సిద్ధం చేస్తారో, అమలు చేస్తారో తెలుసుకోవాలని కోరుకుంటున్నానని జితేంద్ర సింగ్ అన్నాడు.



# 2025 యూఎస్ ఓపెన్ విజేతగా అల్కరాజ్

**రూ.44 కోట్ల ప్రైజ్? మనీ సొంతం**

**రెండోసారి యుఎస్ ఓపెన్ టైటిల్ సొంతం**

**జానిక్ సిన్నర్‌ను మట్టికరిపించిన అల్కరాజ్**

యూఎస్ ఓపెన్ 2025 టైటిల్‌ను గెలుచుకున్న స్పెయిన్ కుర్రాడు కార్లోస్ అల్కరాస్, ట్రోఫీతో పాటు భారీ ప్రైజ్ మనీ సొంతం చేసుకున్నాడు. 6-2, 3-6, 6-1, 6-4తో జానిక్ సిన్నర్‌ను ఓడించి తన కెరీర్‌లో రెండోసారి యుఎస్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. ఇది అతడి ఆరో గ్రాండ్ స్లామ్ టైటిల్ కావడం విశేషం. న్యూయార్క్‌లోని గ్రాండ్ స్లామ్ విక్టరీ సెప్టెంబర్ 2023 తర్వాత మొదటిసారిగా కార్లోస్ అల్కరాస్?ను నెంబర్ 1 ర్యాంకింగ్ స్థానానికి తిరిగి తీసుకువచ్చింది. 22 ఏళ్ల కార్లోస్ అల్కరాస్, ఓపెన్ ఎరాలో అత్యధిక సార్లు పురుషుల సింగిల్స్ ఛాంపియన్లను గ్రాండ్ స్లామ్ ఫైనల్స్‌లో ఓడించిన అతి పిన్న వయస్సు ఆటగాడిగా నిలిచాడు. 2011లో నోవాక్ జోకోవిచ్ తర్వాత ఘనత సాధించిన మొదటి ఆటగాడుగా నిలిచాడు. ఇప్పుడు యుఎస్ ఓపెన్ ట్రోఫీతో పాటు ఏకంగా రూ.44 కోట్లు ఖాతాలో వేసుకున్నాడు. రన్నరప్ గా నిలిచిన సినర్ రూ.22 కోట్లు దక్కించుకున్నాడు. రెండోసారి యూఎస్ ఓపెన్ ఛాంపియన్‌గా నిలిచిన అల్కరాస్?కు గతంలో కంటే 39 శాతం ఎక్కువ ప్రైజ్ మనీ లభించింది. అయితే, ప్రైజ్ మనీలో ఇంత పెరుగుదల ఎందుకు? అల్కరాస్?కు అంత ఎక్కువ డబ్బు ఎందుకు వచ్చింది?అయితే ప్రైజ్? మనీ పెరుగుదలకు కారణం టోర్నమెంట్ ప్రారంభానికి ముందే ప్రైజ్ మనీని పెంచడం. గత సంవత్సరం వరకు యూఎస్ ఓపెన్‌లో విజేతకు 3.6 మిలియన్ డాలర్లు (సుమారు 31.74 కోట్ల రూపాయలు) లభించేవి. కానీ 2025లో ఈ ప్రైజ్ మనీని 39 శాతం పెంచి 5 మిలియన్ డాలర్లు (సుమారు 44 కోట్ల రూపాయలు) చేశారు. అల్కరాస్?కు ఈ భారీ మొత్తమే లభించింది. రన్నరప్ అయిన యానిక్ సిన్నర్‌కు దానిలో సగం అంటే, సుమారు 22 కోట్ల రూపాయలు లభించాయి. విజయం అనంతరం అల్కరాస్ మాట్లాడుతూ %-% 'నేను ఇప్పుడు నా కుటుంబం కంటే సిన్నర్‌ను ఎక్కువగా చూస్తున్నాను. అతనితో కోర్ట్, లాకర్‌రూమ్ షేర్ చేసుకోవడం గర్వంగా ఉంది' అని నవ్వుతూ అన్నాడు. తన శిష్యుడు అద్భుతంగా ఆడాడని కోచ్ జువాన్ కార్లోస్ ఫెర్రెరో ప్రశంసించగా, అల్కరాజ్ కూడా 'నేను పర్ఫెక్ట్‌గా ఆడాను. సిన్నర్‌ను ఓడించాలంటే ఇలాగే ఆడాలి' అని వ్యాఖ్యానించాడు.సిన్నర్ మాత్రం 'అతను నన్ను మించిపోయాడు. నేను చేయగలిగినంత చేశాను కానీ అతను కీలక సమయాల్లో తన స్థాయిని పెంచుకున్నాడు' అని అన్నాడు.అల్కరాజస్ ప్రతి అద్భుత షాట్‌కి ప్రేక్షకులు స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. ఒక అద్భుత వాలీ తర్వాత అల్కరాజ్ కూడా స్వయంగా 'వావ్!' అంటూ చిరునవ్వు చిందించాడు. మరోసారి చేసిన ఓవర్‌హెడ్ స్మాష్ స్టేడియంలో హోరెత్తించింది. సిన్నర్ మాత్రం అసహనం వ్యక్తం చేస్తూ రాకెట్‌ను నేలపైకి విసరడం, నిరాశ చూపించడం కనిపించింది. మొత్తంగా, గత రెండు సీజన్లలో సిన్నర్ ఇతర ఆటగాళ్లపై 109-4 రికార్డు ఉన్నా, అల్కరాజ్‌పై మాత్రం 1-7 వెనుకబడి ఉన్నాడు. వింబుల్డన్‌లో ఓడిన తర్వాత, యూఎస్ ఓపెన్‌లో గెలిచి 'నా కెరీర్‌లోనే అత్యుత్తమ టోర్నమెంట్ ఇది' అని అల్కరాస్ ఆనందం వ్యక్తం చేశాడు.

# ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్... నామినీగా మహ్మద్ సిరాజ్




ఐసీసీ తాజాగా ఆగస్టు నెలకు గాను ప్లేయర్ ఆఫ్ ది మంత్ నామినీలను ప్రకటించింది. ఈ జాబితాలో భారత్ తరఫున పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు చోటు దక్కింది. ఇంగ్లండ్‌తో ఓవల్ స్టేడియం వేదికగా జరిగిన చివరి టెస్టు మ్యాచ్‌లో సిరాజ్ అత్యుత్తమ ప్రదర్శన చేసిన విషయం తెలిసిందే. సిరాజ్‌తోపాటు ఈసారి నామినేట్ అయిన మ్యాట్ హెన్రీ, జేడెన్ ఫాస్ట్ కూడా ఫాస్ట్ బౌలర్స్ కావడం ఆసక్తి రేపుతోంది. ఇక సిరాజ్ గత నెలలో కేవలం ఒక్క మ్యాచ్ మాత్రమే ఆడిన విషయం తెలిసిందే. కానీ ఈ ఒక్క గేమ్ తోనే అతడు ఐసీసీ దృష్టిలో పడ్డాడు. ఇంగ్లండ్‌తో జరిగిన చివరి టెస్టు మ్యాచ్‌లో అతడు 21.11 సగటుతో తొమ్మిది వికెట్లు రాబట్టాడు. ఆ మ్యాచ్‌లో జస్‌ప్రీత్ బుమ్రా లేని లోటును భర్తీ చేస్తూ బౌలింగ్ విభాగంలో జట్టుకు కీలకంగా నిలిచాడు. రెండు ఇన్నింగ్స్‌లో మొత్తం 46 ఓవర్లు వేసిన అతడు తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లను రాబట్టాడు.

ఇక గత నెలలో జింబాబ్వేతో జరిగిన రెండు టెస్టు మ్యాచుల సిరీస్‌లో న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ మాట్ హెన్రీ 9.12 సగటుతో ఏకంగా 16 వికెట్లు రాబట్టాడు. రెండు పర్యాయాలు ఐదు వికెట్లు చొప్పున తీసి ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం కనబరిచాడు. ఈ మ్యాచుల్లో తన సత్తా చాటి.. న్యూజిలాండ్‌కు సిరీస్ దక్కడంలో కీలకపాత్ర పోషించాడు. ఇక పాకిస్థాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో వెస్టిండీస్ బౌలర్ జెయిడెన్ సీల్స్ జట్టును విజయ తీరాలకు చేర్చాడు. 4.1 ఎకానమీ రేటుతో 10 వికెట్లు రాబట్టి పాక్ పతనానికి బాటలు వేశాడు. మూడో వన్డేలో ఏకంగా ఆరు వికెట్ల తీసి వెస్టిండీస్‌కు సిరీస్ సొంతమయ్యేలా కీలకపాత్ర పోషించాడు.

# సిరీస్ గెలిచామనే ఉదాసీనతే తమ ఘోర ఓటమికి కారణం

**సౌతాఫ్రికా హెడ్ కోచ్ శుక్రి కాన్రాడ్ ఆవేదన**

వన్డే క్రికెట్ చరిత్రలోనే సౌతాఫ్రికా అత్యంత ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. 54 ఏళ్ల వన్డే క్రికెట్ చరిత్రలోనే అత్యంత దారుణంగా ఓడిన జట్టుగా సౌతాఫ్రికా చెత్త రికార్డును నమోదు చేసింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో ఆదివారం జరిగిన ఆఖరి వన్డేలో సౌతాఫ్రికా 342 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైంది. వన్డేల్లో పరుగుల పరంగా ఇంత భారీ తేడాతో ఓడిన జట్టు సౌతాఫ్రికా మాత్రమే. ఈ మ్యాచ్‌లో ఓడినా ఈ సిరీస్‌ను సౌతాఫ్రికా 2-1తో కైవసం చేసుకుంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో అసాధారణ ప్రదర్శనతో విజయాన్నందుకొని ఇంగ్లండ్ గడ్డపై 27 ఏళ్ల తర్వాత వన్డే సిరీస్ గెలుచుకుంది. అలాంటి ఆఖరి వన్డేలో 72 పరుగులకే ఆలౌటైంది.ఈ పరాజయంపై సౌతాఫ్రికా హెడ్ కోచ్ శుక్రి కాన్రాడ్ ఆవేదన వ్యక్తం చేశాడు. తొలి రెండు వన్డేల్లో గెలిచి ఆఖరి మ్యాచ్‌లో ఘోర పరాజయాన్ని ఎదుర్కోవడం అత్యంత దారుణమని అసహనం వ్యక్తం చేశాడు. సిరీస్ గెలిచామనే ఉదాసీనతే తమ ఘోర ఓటమికి కారణమని చెప్పుకొచ్చాడు.'ఈ ఘోర పరాజయానికి ఎలాంటి సాకులు లేవు. ఈ రోజు మేము బాగా ఆడలేదు. ఇంగ్లండ్ వంటి టాప్ టీమ్‌తో ఆడేటప్పుడు సరిగ్గా ఆడకపోతే మన బలహీనతలు బయటపడుతాయి. ఆస్ట్రేలియాలో కూడా ఇలాగే జరిగింది. అక్కడ కూడా సిరీస్‌ను 2-0తో గెచుకున్న తర్వాత ఆఖరి వన్డేలో 400 పరుగులకు పైగా సమర్పించుకున్నాం. ఇలాంటి మ్యాచ్‌ల్లో మేము పేలవ ప్రదర్శన చేస్తున్నాం. ఇది ఏమాత్రం అమోదయోగ్యం కాదు. ఈ ఓటమి కొంచెం ఇబ్బందికరంగానే ఉంది. బహుశా మా ఆగాళ్లు సిరీస్ గెలిచామనే ఉదాసీనతో ఆడినట్లున్నారు. ఫీల్డింగ్ కూడా మా స్థాయికి తగ్గట్లు లేదు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే టీ20 సిరీస్‌పై ఫోకస్ పెట్టాం. టీ20 ప్రపంచకప్ 2026 సన్నాహకాలను ఈ సిరీస్ నుంచి ప్రారంభిస్తాం. ఈ వన్డే సిరీస్‌లో ఘోర పరాజయం ఎదురైనా.. మాకు అనేక సానుకూలంశాలు ఉన్నాయి. తొలి రెండు మ్యాచ్‌ల్లో అనుభవం లేని ఆటగాళ్లు మెరుగైన ప్రదర్శన చేశారు.'అని శుక్రి కాన్రాడ్ చెప్పుకొచ్చాడు.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లకు 414 పరుగులు చేసింది. జోరూట్(100), జాకోబ్ బెతెల్(110) శతకాలతో రాణించారు. అనంతరం సౌతాఫ్రికా 72 పరుగులకే ఆలౌటైంది. జోఫ్రా ఆర్చర్(4/18), ఆదిల్ రషీద్(31/3) సఫారీ పతనాన్ని శాసించారు. బ్రైడన్ కార్స్(2/33) రెండు వికెట్లు పడగొట్టాడు.

